ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com



RNI TGTEL/25/A5065

# vaartha sandhya వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు





SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01 సంచిక : 202  శుక్రవారం 10 - 07 - 2026  ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్  పేజీలు : 08  వెల : 6/-



Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 202  Friday 10 - 07 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-


## హైదరాబాద్ సేఫ్ ప్లేస్ అందుకే పెట్టుబడులు వస్తున్నాయి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని వెల్లడి
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని పిలుపు



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 09 :** ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషం చిమ్మడం ఆపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవుపలికారు. కాలుష్యపు కోరల నుంచి నగరాన్ని రక్షించేందుకు పరిశ్రమల్ని ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తామని పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీకారంచుట్టారు. పరిశ్రమల అవసరాలకు అనగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలని సీఎం ఆకాంక్షించారు.భద్రత ఉండే చోటే ఎక్కువ పెట్టుబడులు వస్తాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ అందుకు అత్యంత అనుకూల ప్రదేశమని అభివర్ణించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని అభినందించారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందు ఉన్నప్పటికీ కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయని వాటి శాశ్వత పరిష్కారానికి - మిగతా 2 లో



## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత
- బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 09 :** బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలనేది నా డ్రీమ్



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమం
- పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి
- ఖేలో ఇండియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 09 :** ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందామని తెలిపారు. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారని గుర్తు చేశారు. పీటీ ఉషతో కలిసి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ - మిగతా 2 లో

## 'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి'




- మెల్‌బోర్న్‌లో ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపు
- ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ
- దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమన్న మోదీ
- సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా సంస్థలకు పిలుపు
- ఇరుదేశాలు విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగాలన్న ప్రధాని

**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 09 :** 'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి' అంటూ మెల్‌బోర్న్‌లోని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఒక లక్ష్యం పూర్తయితే మరో సంకల్పం తీసుకని ముందుకెళ్లాలని తెలిపారు. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థతో భారత్ వేగంగా అడుగులో వేస్తోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుందని పేర్కొన్నారు. చంద్రయాన్ ద్వారా తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టామని, అంతరిక్షంలోకి గగన్‌యాన్ పంపేందుకు భారత్ సిద్ధమవుతోందని తెలిపారు. అలాగే, భారత్ సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతోందని మోదీ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ప్రసంగించారు."భారత్‌లో - మిగతా 2 లో

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్



- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 09 :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట - మిగతా 2 లో

## హర్మూజ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా భారత్‌కు చమురు కొరత లేదు

- ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ పై ముప్పు!
- హర్మూజ్ జలసంధి ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై తక్కువే
- యథాతథంగా భారత్‌కు ముడి చమురు సరఫరా ఉందన్న కెప్లర్
- గ్యాస్ సరఫరాపై మాత్రం టెన్షన్



**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 09 :** పశ్చిమాసియాలోని హర్మూజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను ఆందోళనకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇలా ఉన్నా భారత్‌కు ముడి చమురు సరఫరాపై తక్షణ - మిగతా 2 లో

## రూ.2000 నోట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన

- రూ.2000 నోట్లపై తాజా వివరాలు వెల్లడించిన ఆర్బీఐ
- చెలామణిలోని 98.47 శాతం నోట్లు బ్యాంకులకు వాపస్
- ప్రస్తుతం మార్కెట్‌లో రూ.5,451 కోట్ల విలువైన నోట్లు మాత్రమే
- ఈ నోట్లు ఇప్పటికీ చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని స్పష్టీకరణ
- నోట్లను మార్చుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో ఇప్పటికీ సౌకర్యం



**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 09 :** దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో దాదాపు 98.47 శాతం వెనక్కి వచ్చినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. దాదాపు మూడేళ్ల క్రితం ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్బీఐ, తాజాగా ప్రస్తుత పరిస్థితిపై గణాంకాలను విడుదల చేసింది.కరెన్సీ నిర్వహణలో భాగంగా 2023 మే 19న రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మార్కెట్‌లో మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ కేవలం రూ.5,451 కోట్లకు పడిపోయిందని ఆర్బీఐ - మిగతా 2 లో

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత

- అమల్లోకి కొత్త నిబంధనలు
- కారుణ్య మరణంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు
- 'లివింగ్ విల్' ద్వారా చికిత్సపై ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం
- రెండు దశల మెడికల్ బోర్డుల పరిశీలన తర్వాతే అమలుకు అనుమతి

**వార్త సంధ్య, అమరావతి, జులై 09 :** ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో - మిగతా 2 లో

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం



- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతులు, రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సెమినార్
- రెండో ఏడాది 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మనోహర్
- 95 శాతం చెల్లింపులను 24 గంటల్లో పూర్తి చేశామన్న మంత్రి

## భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- బనగానపల్లెలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశాం
- 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72.70 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ
- వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని వెల్లడి
- వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు 'జలధార' కార్యక్రమం ప్రారంభం




**వార్త సంధ్య, అమరావతి, జులై 09 :** రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గత పాలకులు చేసిన పాపాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో పర్యటించిన సీఎం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసినట్టు తెలిపారు."ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండాలి. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం, 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్‌లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్‌లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్‌భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం. - మిగతా 2 లో

# సంపాదకీయం


## గ్రంథాలయ గ్రామం




ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి సుమారు 1,664 మీటర్ల ఎత్తులో ఉన్న చిన్న కొండ గ్రామం మణిగుహ్. హిమాలయాల అద్భుత దృశ్యాల మధ్య ఉన్న ఈ గ్రామం ఇప్పుడొక ప్రత్యేక గుర్తింపును సాధించింది. 20,000కు పైగా పుస్తకాలు, ఎనిమిది పఠన కేంద్రాలు, చదవడాన్ని దైనందిన జీవితంలో భాగంగా మార్చుకున్న సముదాయం కారణంగా ఇది 'గ్రంథాలయ గ్రామం'గా ప్రసిద్ధి చెందింది. ప్రకృతి అందాల మధ్య జ్ఞానానికి నిలయంగా మారిన ఈ గ్రామం, ఆధునిక భారత గ్రామీణాభివృద్ధికి ఒక కొత్త నమూనాను చూపిస్తోంది.ఈ గ్రామం నుంచి చౌఖంబా, సతోపంథ్, తలయ్‌సాగర్ వంటి హిమాలయ శిఖరాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇక్కడి పిల్లలు కొండ మార్గాల్లో నడుస్తూనే పుస్తకాల్లో మునిగిపోవడం, సాంకేతిక స్క్రీన్లకు సమానంగా పుస్తకాలను తమ జీవితంలో భాగం చేసుకోవడం ఒక సాధారణ దృశ్యం. చదవడం ఇక్కడ రోజువారీ జీవనశైలిగా మారింది. మణిగుహ్-- 'గ్రంథాలయ గ్రామం'గా పరివర్తన చెందడం వెనుక 'హమారా గావ్ ఘర్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ దీర్ఘకాలిక కృషి ఉంది. గ్రామంలో చదవడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ప్రజలను పుస్తకాలతో అనుసంధానించడం, విద్యను గ్రామ జీవనంలో భాగంగా మార్చడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. వారి ప్రయత్నాల ఫలితంగా గ్రామం.. ఒక సాధారణ నివాస ప్రాంతం నుంచి జ్ఞాన కేంద్రంగా మారింది.ఈ కార్యక్రమానికి కేంద్ర బిందువుగా ఉన్నది మణిగుహ్ సెంట్రల్ లైబ్రరీ, స్థానికంగా దీనిని 'పుస్తక తీర్థం'గా పిలుస్తారు. ఇక్కడ హిందీ, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృతం, కశ్మీరీ, పంజాబీ వంటి అనేక భాషల్లో ఇరవై వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సైన్స్, చరిత్ర, సాహిత్యం, పోటీ పరీక్షల సన్నద్ధత, పిల్లల కథలు వంటి విభిన్న అంశాల పుస్తకాలు ఇందులో ఉన్నాయి. 19వ శతాబ్దానికి చెందిన అరుదైన ముద్రణలు కూడా ఇక్కడ భద్రపరచబడ్డాయి. ఈ గ్రంథాలయానికి ప్రవేశం పూర్తిగా ఉచితం. గ్రంథాలయ గ్రామ నమూనా మరో ముఖ్య లక్షణం... చదవడాన్ని ఒకే భవనానికి పరిమితం చేయకపోవడం. గ్రామం చుట్టుపక్కల ఉన్న ప్రతాప్‌నగర్, ఖమోలి, బందీ, ఖల్యూ వంటి ప్రాంతాల్లో ఎనిమిది చిన్న పఠన కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని 'పుస్తక మందిర్'లుగా పిలుస్తారు. ఇవి ప్రజలు సహజంగా కూడే ప్రదేశాల్లో-- దారులు, దేవాలయాలు, గ్రామ చౌరస్తాలు-- నిర్మించారు.మణిగుహ్ అభివృద్ధి నమూనా కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాదు. ఇది జీవనోపాధి, పర్యావరణం, సామాజిక అభివృద్ధిని కూడా కలిపిన సమగ్ర విధానాన్ని అనుసరిస్తోంది. గ్రామ మహిళలు పైన్ సూదులతో (పైరుల్) చేతిపని ఉత్పత్తులు తయారు చేస్తారు. సాధారణంగా అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే పైన్ సూదులను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా, పర్యావరణ సమస్యను ఆర్థిక అవకాశంగా మార్చారు. ఈ ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఈ కార్యక్రమంలో మహిళల భాగస్వామ్యం గ్రామ ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తోంది. అదేవిధంగా తేనెటీగల పెంపకం (అపి కల్చర్) శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఇవి గ్రామస్థులకు స్థిరమైన ఆదాయ వనరులను అందించడమే కాకుండా, ప్రకృతితో సమన్వయంగా జీవించాలనే భావనను పెంపొందిస్తున్నాయి. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిని కలిపి ముందుకు తీసుకెళ్లడం ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఒక కొత్త మార్గం రూపొందించారు.ప్రతి సంవత్సరం నిర్వహించే 'గావ్--ఘర్ మహోత్సవ్' ఈ గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రొఫెసర్లు, రచయితలు, కళాకారులు, కవులు పాల్గొంటారు. గ్రామ ప్రజలతో కలిసి వారు జ్ఞాన, సాంస్కృతిక చర్చల్లో భాగస్వామ్యం అవుతారు. 'బుక్ మారథాన్' అనే కార్యక్రమం ద్వారా చదవడాన్ని సామూహిక ఉద్యమంగా మార్చారు. అన్ని వయసుల ప్రజలు ఇందులో పాల్గొని పుస్తకాలను చదవడం, చర్చించడం ద్వారా అక్షరాస్యతను సామాజిక అనుభవంగా మారుస్తున్నారు. ఈ ప్రయత్నాలు గ్రామాన్ని కేవలం నివాస ప్రాంతంగా కాకుండా, ఒక ఆలోచనా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాయి. ఉద్యోగ అవకాశాల కోసం యువత నగరాలకు వలస వెడుతున్న పరిస్థితిని తగ్గించడానికి మణిగుహ్ గ్రామంలో విద్య, జీవనోపాధి, సాంస్కృతిక అభివృద్ధి వంటివాటిని ఒకే వేదికపై తీసుకువచ్చారు. ఉత్తరాఖండ్ ఓపెన్ యూనివర్సిటీ వంటి సంస్థలు కూడా ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలను తిరిగి విద్యా వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత బలం చేకూరుస్తున్నారు.మొత్తానికి, మణిగుహ్ గ్రామం చూపిస్తున్నది ఒక స్పష్టమైన సందేశం-- 'పుస్తకాలు కేవలం చదవడానికి మాత్రమే కాదు, జీవితాన్ని మార్చడానికి కూడా ఉపయోగపడతాయి. ఒక్కో పేజీని తిరగేయడం ద్వారా ఒక సమాజం తన భవిష్యత్తును తిరిగి రాసుకోవచ్చు' అని.

## భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. ఇలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులున్నారు. ఆస్తి కోసం తల్లిని హింసిస్తున్నారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రికి పూజలు చేస్తున్నారు. తల్లిని గౌరవించలేని వ్యక్తి మనకు అవసరమా? తల్లులంటే గౌరవం ఉండాలనే, తల్లికి వందనం తీసుకొచ్చా.గొడ్డలి పార్టీ విసుగు, విరామం లేకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. కులం, మతం, ప్రాంతాల వారీగా ముక్కలు చేసే కుట్రకు పాల్పడుతోంది. రాయలసీమలో ముఠాలు లేకుండా చేసింది టీడీపీనే. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా ఉండాలి. ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరగాలి. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మనోభావాలు దెబ్బతీయడం మంచిదికాదు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అని మళ్లీ హెచ్చరిస్తున్నా" అని




చంద్రబాబు అన్నారు.దేవుళ్లను అవమానించిన యూట్యూబర్ రావణ్‌ను గొడ్డలి పార్టీ వెనకేసుకొస్తోందని చంద్రబాబు ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తులు హేరామ్ అనడం ఆశ్చర్యంగా ఉందన్న చంద్రబాబు ఇలాంటి వింతలు జరుగుతాయని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో ఎప్పుడో రాశారని జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు."అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశాం. భూవివాదాల పరిష్కారానికి దృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నాం. భద్రతా ఫీచర్లు పెట్టి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72.70 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ. భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాయలసీమ హార్టీ కల్చర్ హబ్‌గా మారుతుంది. ఎల్?నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా జలధార కార్యక్రమం ప్రారంభించామన్న సీఎం చంద్రబాబు.మరోవైపు ఇంటగెలిచి రచ్చగెలవాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికికి ముఖ్యమంత్రి చంద్రబాబు హితబోధ చేశారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను సీఎం పంపిణీ చేసిన అనంతరం నియోజకవర్గంలో శాఖల వారీగా అధికారులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చారు. బాగా పనిచేసిన వారిని అభినందించారు. తక్కువ పనితీరు చూపినవారిని మెరుగుపరుచుకోవాలని హితవు పలికారు. లేదంటే తానే నేర్పుతానని చురకలు వేశారు. అధికారులతో పనులు చేయించాలని, మెతకగా ఉంటే సరిపోదని ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డికి సీఎం సూచించారు.

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత

మొదటిపేజీ తరువాయి -
బాధపడుతున్న రోగులకు జీవనాధార వ్యవస్థలను ఉపసంహరించుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు.ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.

### మార్గదర్శకాలలోని ముఖ్యాంశాలు

ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి.ఒకవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర




ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## 'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి'

మొదటిపేజీ తరువాయి - హైడ్రో ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్, సోలార్ మాడ్యూల్స్, విండ్ మిల్స్ కోసం మేము ఒక బలమైన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన సాంకేతికత, పెట్టుబడులు, వనరులు ఈ పరివర్తనను మరింత వేగవంతం చేయగలవు. కొన్ని నెలల క్రితమే శాంతియుత ప్రయోజనాల చట్టం ద్వారా భారత్ అణు రంగాన్ని ప్రైవేట్ కంపెనీలకు కూడా భారత్ అందుబాటులోకి తెచ్చింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆస్ట్రేలియాలో ఉన్న అపారమైన యురేనియం నిల్వలు భారత్ అణు ఇంధన ప్రయాణంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయి."-నరేంద్ర మోదీ, భారత ప్రధానమంత్రి.దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమని, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలను మోదీ కోరారు. భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇండోనేసియా పర్యటన ముగించుకొని ప్రధాని మోదీ ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధానికి అక్కడి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని వీక్షించారు. తర్వాత మెల్‌బోర్న్‌లో జరిగిన ఆసీస్‌లో ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓ ఫోరమ్ సదస్సులో పాల్గొన్నారు. విమాన, రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, కీలక ఖనిజాలు, టెక్నాలజీ, ఆహార భద్రత వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను సీఈఓలతో మోదీ చర్చించారు. ఈ సందర్భంగా అల్బనీస్, మోదీ సరదాగా సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మాట్లాడిన ప్రధాని ద్వైపాక్షిక వాణిజ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చే ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని ఆల్బనీస్‌ను కోరారు. భారత్, ఆస్ట్రేలియాలు సహజమైన, విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగడం ఎంతైనా అవసరం ఉందన్నారు.ఇదిలా ఉండగా, గత 12 ఏళ్లలో తాను ఆస్ట్రేలియాలో పర్యటించడం ఇది మూడోసారని మోదీ తెలిపారు. గడిచిన కాలంలో భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు గొప్ప శిఖరాలకు చేరుకున్నాయని, ఇందులో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రవాస భారతీయుల దినచర్య వారిని భారతదేశంతో అనుసంధానించి ఉంచుతుందని, అలాగే వారు ఆస్ట్రేలియా అభివృద్ధికి కూడా దోహదపడుతున్నారని కొనియాడారు.

## హర్మూజ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా భారత్‌కు చమురు కొరత లేదు

మొదటిపేజీ తరువాయి - ప్రభావం ఉండే అవకాశం తక్కువగా ఉందని అంతర్జాతీయ ఇంధన మార్కెట్ విశ్లేషణ సంస్థ కెప్లర్ వెల్లడించింది. అయితే ఈ పరిస్థితులు ఎక్కువ కాలం కొనసాగితే మాత్రం ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాలు, రవాణా వ్యయాలు, బీమా ఖర్చులపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణపై తాజాగా చేసిన వ్యాఖ్యల అనంతరం పశ్చిమాసియాలో ఘర్షణలు చెలరేగాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఇంధన రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధి భద్రతపై ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ భారత్ గత కొన్నేళ్లుగా ముడి చమురు కొనుగోలు వనరుల్ని విస్తరించుకున్న క్రమంలో ప్రస్తుతం సరఫరాపై పెద్దగా ప్రభావం లేదని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా తెలిపారు. భారత క్రూడాయిల్ దిగుమతులకు ఎలాంటి ఆటంకం లేదని, దేశీయ రిఫైనరీలకు చమురు సరఫరా యథాతథంగానే కొనసాగుతోందని అన్నారు.సుమిత్ రిటోలియా వివరాల ప్రకారం- రష్యా ఇప్పటికీ భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా ఉంది. ఇదే



సమయంలో సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రత్యామ్నాయ మౌలిక వసతుల ద్వారా చమురు సరఫరా కొనసాగుతోంది. ఇంకా పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి కూడా దిగుమతులు పెరగడంతో భారత్ గతంలో మాదిరిగా ఒకే ప్రాంతంపై ఆధారపడే పరిస్థితి తగ్గింది. దీంతో సరఫరా వ్యవస్థ మరింత బలపడిందని ఆయన చెప్పారు. ఈ వ్యూహం ఫలితంగానే 2026 జూన్ నెలలో భారత్ రికార్డు స్థాయిలో రోజుకు సగటున 4.93 మిలియన్ బ్యారెళ్ల చొప్పున క్రూడాయిల్ దిగుమతి చేసుకుంది. దీంట్లో సుమారు 2.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రష్యా నుంచే వచ్చింది. అంటే మొత్తం క్రూడ్ దిగుమతుల్లో దాదాపు సగానికిపైగా రష్యా వాటానే ఉండటం వల్ల, రష్యా భారత్‌కు ప్రధాన ఆయిల్ సరఫరాదారుగా తన స్థానాన్ని మరింత బలపర్చుకుంది.హర్మూజ్ జలసంధి మీదుగా చమురు నౌకల రాకపోకలు ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగితే మాత్రం భారత్‌పై ప్రభావం పడుతుందని కెప్లర్ అంచనా వేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే షిప్పింగ్ ఛార్జీలు, ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా ఆంక్షలు, వాణిజ్యపరమైన అనిశ్చితి కారణంగా సమీప భవిష్యత్తులో ఇరాన్ చమురు- భారత దిగుమతుల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొంది. కెప్లర్ విశ్లేషణ ప్రకారం ప్రస్తుతం అసలు ఆందోళన ముడి చమురుపై కాకుండా పైనే ఉంది. ఈ ఇంధనాలకు తక్షణ ప్రత్యామ్నాయాలు తక్కువగా ఉండటంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగితే సరఫరా తగ్గడం, రవాణా వ్యయాలు పెరగడం తద్వారా ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిక చేసింది.

## హైదరాబాద్ సేఫ్ ప్లేస్ - అందుకే పెట్టుబడులు వస్తున్నాయి

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకెళుతోందని సీఎం వివరించారు.2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారన్న ఆయన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని కోరారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు.గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయని సీఎం కొనియాడారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుందని, అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని, అందుకే సిటీలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. "ముంబయి, చెన్నై వంటి నగరాలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి. కాలుష్యం, ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫాక్చరింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుంది. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పుతున్నాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటికి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలి" – రేవంత్ రెడ్డి, సీఎం.పెట్టుబడులతో పాటు ఆవిష్కరణలు, ఉత్పత్తిని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో పాలసీనే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని స్పష్టం చేశారు. 75 ఎకరాల్లో కేవలం ఏడాదిలోనే పరిశ్రమ నెలకొల్పడం పట్ల ప్రీమియర్ ఎనర్జీస్ యాజమాన్యాన్ని అభినందించిన సీఎం స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

మొదటిపేజీ తరువాయి - కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు తెచ్చామన్నారు.గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు.ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

## రూ.2000 నోట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి - తెలిపింది.రూ.2000 నోట్లను మార్చుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ఇష్యూ కార్యాలయాల్లో ఇప్పటికీ సౌకర్యం అందుబాటులో ఉంది. నోట్లను ఉపసంహరించుకున్నప్పటికీ, అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని (లీగల్ టెండర్) ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది. ప్రజల వద్ద ఉన్న నోట్లను ఆర్బీఐ కార్యాలయాల్లో డిపాజిట్ చేయడం లేదా ఇతర నోట్లతో మార్చుకోవడం చేయవచ్చని సూచించింది.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

మొదటిపేజీ తరువాయి - లభించింది.పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది.ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు.బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు. కాగా, తన బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు గతంలో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది నా డ్రీమ్

మొదటిపేజీ తరువాయి - అండ్ స్పోర్ట్స్ వర్సిటీని సీఎం ప్రారంభించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ వేడుకలో స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగోను పీటీ ఉషతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 8వ ఖేలో ఇండియన్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని, అందుకే క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 1990-2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది తమ డ్రీమ్ అని, 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని, దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి

మొదటిపేజీ తరువాయి - చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిసు_న్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల




వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి.ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం"అని స్పష్టం చేశారు.

## రుద్రంపూర్ క్లబ్‌లో హెఆర్ఎస్ యూనియన్ 'బాయ్ బాట' కార్యక్రమం

### పెద్ద ఎత్తున హాజరైన యూనియన్ నాయకులు, కార్యకర్తలు



**చుంచుపల్లి ప్రతినిధి జూలై 9:**(వార్త సంధ్య)రుద్రంపూర్ క్లబ్‌లో నిర్వహించిన ఎమీా యూనియన్ సమావేశంలో ప్రముఖ కార్మిక నాయకురాలు కవిత పాల్గొని "బాయ్ బాట" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమీా యూనియన్ నాయకులు, కార్మిక ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడి పలు అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## చంద్రుగొండలో ఎస్ఐఆర్ సర్వేకు బీఆర్ఎస్ నాయకుల సహకారం




**చంద్రుగొండ ప్రతినిధి, జూలై 9 ( వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కేంద్రంలోని 3వ వార్డు, 54వ బూత్ పరిధిలో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ (రాజూవఎఱఖశ్రీ ×తీవఅంఱజవ =వజఱంఱశీఅ) సర్వే కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వో షేక్ హస్సేన్‌తో కలిసి బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు, బీఎల్ఏ సూరా వెంకటేశ్వర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను నమోదు చేసి బీఎల్‌వోకు అందజేసే కార్యక్రమంలో సహకరించారు. కార్యక్రమంలో 54వ బూత్ బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏ యలమందల లక్ష్మణ్, గ్రామ యూత్ నాయకుడు మహమ్మద్ షారీజ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ చేపడుతూ, ఓటర్ల సహకారం కోరుతున్నారు.

## బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్

### పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వహిస్తానని హామీ





భారతీయ జనతా పార్టీ తెలంగాణ
BHARATIYA JANATA PARTY TELANGANA
ఎండోమెంట్ సెల్ (ధార్మిక)
TELANGANA ENDOWMENT CELL (DHARMIKA)
Shri Annavajjula Surya Prakash Convener 9392480426
Shri Niranjan Desai Co-Convener 7993478853

BJPEC/APP/DC/No: 002 Date: 08/07/2026

శ్రీ కస్తూరి సుధాకర్ గారికి,

నమస్కారములు,

మిమ్ములను భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ (ధార్మిక) సెల్ తెలంగాణ యందు రాష్ట్ర కమిటీ తరపున భద్రాచలం జిల్లా కన్వీనర్ గా నియమింపబడ్డారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

బిజెపి సిద్ధాంతాలకు ఆదర్శాలకు అలాగే ఎండోమెంట్ సెల్ నియమ నిబంధనలకు లోబడి నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధి తో వ్యవహరిస్తారని, సహచర కార్యకర్తలను, పార్టీలో మీకంటే అనుభవజ్ఞులను సదా గౌరవిస్తారని, అలాగే పార్టీ ఇతర కమిటీలు/మోర్చాలు/ సెల్లులతో కలిసి పార్టీ అన్నీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని, మీ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్టపరచి అన్ని వర్గాలలో, ప్రాంతాలలో పార్టీని మరింత విస్తరించడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాము.

అభినందనల తో,

(నిరంజన్ దేశాయ్) రాష్ట్ర కో-కన్వీనర్
(సూర్యప్రకాష్ అన్నవజ్జల) రాష్ట్ర కన్వీనర్

Address/Phone/E-mail:

Dr. S. P. Mookerjee Bhawan, Opp. Exhibition Grounds Nampally, Hyderabad - 500 001 Phone: off: 040-24653535, Fax: 040-24653929, e-mail: bjptsonline@gmail.com

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 09 (వార్త సంధ్య) :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ (ధార్మిక) సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం అధికారిక నియామక పత్రాన్ని అందజేసింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు సూచన మేరకు రాష్ట్ర ఎండోమెంట్ (ధార్మిక) సెల్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ సమక్షంలో ఈ నియామక కార్యక్రమం జరిగింది. అదే కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్లుగా పంజాల రమేష్, దండా రామచంద్రరావులను, జిల్లా జాయింట్ కన్వీనర్‌గా చింతల శాంతకుమారిని నియమిస్తూ నియామక పత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కస్తూరి సుధాకర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి జిల్లా కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ ప్రగడ రామారావు, అలాగే బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా, ఎండోమెంట్ (ధార్మిక) సెల్ నిబంధనలకు లోబడి పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పార్టీ బలోపేతానికి, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రజలకు, భక్తులకు సేవలందిస్తూ ఎండోమెంట్ సెల్ లక్ష్యాల సాధనకు కట్టుబడి పనిచేస్తానని కస్తూరి సుధాకర్ స్పష్టం చేశారు.

## సుజాతనగర్‌లో బీఆర్ఎస్ సంబరాలు.. వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు


### బాణాసంచా, కేక్ కట్‌తో ఘన వేడుకలు నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు

### ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ కాపు సీతామాలక్ష్మి, కాపు కృష్ణ హాజరు



**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 9(వార్త సంధ్య) :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా నియమితులైన సందర్భంగా పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి, వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకం ఇటీవల అధికారికంగా ప్రకటించబడింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన కొత్త...

## శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో బండి రమేష్ ప్రత్యేక పూజలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంక టేశ్వర స్వామివారి అను గ్రహం ప్రజలందరిపైన ఉండాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొ రేషన్ చైర్మన్ బండి రమేష్ ఆకాం క్షించారు. గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని వివే కానందనగర్ లో గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన శ్రీశ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ మరియు ఆలయ పాలకవర్గ సభ్యుల ఆహ్వానం మేరకు బండి రమేష్ ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బండి రమేష్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వేముల సత్యం, మస్తాన్ రెడ్డి, శ్రీనివాస యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా కార్యాలయం ప్రారంభం

### ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యం - సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ

### జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని టౌన్ పరిధిలో ఉన్న ఎస్ఆర్‌కే కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా కార్యాలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, కమిటీ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకొని వాటిని వినియోగించుకునేలా అవగాహన కల్పించడం ప్రతి సామాజిక సంస్థ బాధ్యత అని అన్నారు. మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వారికి న్యాయ సహాయం అందించేందుకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని పిలుపునిచ్చారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో ఎవరైనా అన్యాయానికి గురైతే వారికి చట్టపరమైన సహాయం అందించేందుకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ హక్కులపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు చేరువ కావాలని ఆయన సూచించారు. జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ యామినీ లక్ష్మీ రాణి మాట్లాడుతూ, మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, బాలల హక్కుల ఉల్లంఘన వంటి అంశాలపై చట్టపరమైన అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా కోఆర్డినేటర్లు, జిల్లా నాయకులు, అడ్వైజరీ బోర్డు సభ్యులు, వివిధ మండలాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు) అందజేశారు. భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, న్యాయ సహాయం, సామాజిక సేవా కార్యక్రమాల్లో సమిష్టిగా పనిచేస్తామని సభ్యులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా కార్యాలయం ప్రారంభం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలు మరింత విస్తృత స్థాయిలో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# గ్రామం నిలదీస్తోంది తన హక్కుల కోసం!

### గ్రామ స్వరాజ్యంతోనే పేదలు లేని సమాజం

### మేం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తాం

### - శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ

### అక్టోబర్ 2 నుంచి తెలంగాణలో చారిత్రాత్మక "గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర"

**రాష్ట్రంలోని ప్రతి పల్లెకు చేరనున్న జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ ౣ ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత ౣ గ్రామ స్వరాజ్యమే లక్ష్యం ౣ సర్పంచ్‌లకు సంపూర్ణ అధికారాలు ౣ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, రైతులు, యువత సాధికారతే యాత్ర ధ్యేయం**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 9:** మహాత్మా గాంధీ కలలుగన్న "గ్రామ స్వరాజ్యం" స్ఫూర్తితో, తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పునర్నిర్మాణానికి నాంది పలికే చారిత్రాత్మక లి"గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర"లిను అక్టోబర్ 2 నుంచి ప్రారంభించనున్నట్లు జై స్వరాజ్ పార్టీ ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ నేతృత్వంలో జరిగే ఈ మహాయాత్ర తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని చేరుకుని ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతుంది. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, గ్రామాలకు నిజమైన స్వయం పాలనను కల్పించడం, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతను అందించడం, స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, సామాజిక న్యాయం ఆధారంగా తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశను చూపించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యాలని పార్టీ వెల్లడించింది. "గ్రామం బలపడితేనే తెలంగాణ బలపడుతుంది"ఈ సందర్భంగా శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అధికార వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్య పాలన, గ్రామాలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి, స్థానిక సంస్థలకు పూర్తి అధికారాలే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాదులని పేర్కొన్నారు."ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలి. ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఎదగాలి. ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందాలి. ఇదే గ్రామ స్వరాజ్య ఉద్యమం లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు.సమగ్ర సామాజిక సాధికారతకు మహా ఉద్యమం గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్రలో గ్రామ స్వయం పాలనతో పాటు సమాజంలోని అన్ని వర్గాల సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పార్టీ ప్రకటించింది.యాత్రలో ప్రధానంగా ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించనున్నారు:ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతగ్రామ స్వరాజ్యం - - గ్రామాలకు నిజమైన స్వయం పాలన సర్పంచ్‌ల ఆత్మగౌరవ పరిరక్షణ, గ్రామ పంచాయతీలకు సంపూర్ణ అధికారాలు బీసీలకు రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉపాధి అవకాశాల్లో సముచిత ప్రాధాన్యం ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సామాజిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ప్రత్యేక కార్యాచరణ పేద, బలహీన వర్గాల జీవన ప్రమాణాల మెరుగుదల, ఆర్థిక స్వావలంబన మహిళా స్వరాజ్యం -- మహిళలకు భద్రత, గౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యం, నాయకత్వ అవకాశాలు రైతు స్వరాజ్యం -- వ్యవసాయానికి స్థిరమైన విధానాలు, గిట్టుబాటు ధర, రైతు కుటుంబాలకు భరోసా యువ స్వరాజ్యం -- నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, యువ నాయకత్వానికి అవకాశాలు పారదర్శక, అవినీతి రహిత, జవాబుదారీతనంతో కూడిన ప్రజా పాలన ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి యాత్ర సందర్భంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు, ప్రజా సమావేశాలు, రైతులు, మహిళలు, యువత, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాలతో ప్రత్యక్ష చర్చలు నిర్వహించి వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను సేకరించనున్నారు. ప్రజల ఆకాంక్షల ఆధారంగా గ్రామాభివృద్ధి కార్యాచరణకు రూపకల్పన చేయనున్నట్లు పార్టీ తెలిపింది. ఇది రాజకీయ యాత్ర కాదు -- ప్రజల భవిష్యత్తు కోసం మహా సంకల్పం ఈ యాత్ర కేవలం రాజకీయ ప్రచార కార్యక్రమం కాదని, గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా, పరిపాలనా పరంగా బలపడే తెలంగాణ నిర్మాణం కోసం చేపట్టిన మహా ప్రజా ఉద్యమమని పార్టీ స్పష్టం చేసింది. గ్రామాభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక భద్రత, స్థానిక స్వయం పాలన ఆధారంగా "సమగ్ర తెలంగాణ" నిర్మాణమే జై స్వరాజ్ పార్టీ సంకల్పమని పేర్కొంది. తెలంగాణ ప్రజలకు పిలుపు గ్రామ సర్పంచ్‌లు, రైతులు, వ్యవసాయ కార్మికులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళలు, యువత, మేధావులు, ఉద్యోగులు, కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్య విలువలను విశ్వసించే ప్రతి ఒక్కరూ ఈ చారిత్రాత్మక గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్రలో భాగస్వాములు కావాలని జై స్వరాజ్ పార్టీ పిలుపునిచ్చింది.

ప్రధాన నినాదాలు "మన గ్రామం - మన పాలన""ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత - ప్రతి గ్రామానికి స్వయం పాలన""బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, రైతులు, యువత సాధికారతే గ్రామ స్వరాజ్యం" "గ్రామం బలపడితేనే తెలంగాణ బలపడుతుంది""సమగ్ర అభివృద్ధికి మార్గం -- గ్రామ స్వరాజ్యం" - జై స్వరాజ్ పార్టీ

# తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఎఐటియుసిదే

### తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని తొలి ఉద్యమం చేపట్టింది ఎఐటియుసి

### ఏఐటీయూసీ నాయకులు మిర్యాల రంగయ్య



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 09 (వార్త సంధ్య) :** తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ తొలి ఉద్యమాన్ని 2013లోనే ఎఐటియుసి ప్రారంభించిందని, అనంతరం 2017 మే 12 నుంచి 18 వరకు "సింగరేణి జాతా" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించి ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఏకైక కార్మిక సంఘం ఎఐటియుసి మాత్రమేనని ఆ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. గురువారం కార్పొరేట్ ఏరియా మెయిన్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణికే కేటాయించడం వల్ల సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ అంశంపై ఎఐటియుసి నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ఆలస్యం చేయకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును రద్దు చేయాలని, సింగరేణి వ్యాప్తంగా గనులు, వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేసి ఉత్పత్తి, భద్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్‌పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం "బయ బాట" పేరుతో కార్మికుల ముందుకు వచ్చి సానుభూతి కోరుతున్నారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికుల సంక్షేమం కోసం చెప్పుకోదగ్గ చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు కార్మికుల పట్ల ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని వ్యాఖ్యానించారు. కార్మికులు అన్ని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని, ఎవరి వైఖరి ఎలా ఉందో వారికి బాగా తెలుసని అన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో ఎఐటియుసి కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, పిట్ కార్యదర్శి సుధీర్, నాయకులు వేమన చారి, దినేష్, సత్యనారాయణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మొక్కలు నాటడం మనందరి బాధ్యత..

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


### -- సిహెచ్ ప్రదీప్ రెడ్డి, గట్టు కృష్ణమూర్తి

**మంథని, జూలై, 09 (వార్త సంధ్య ):** ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని ప్రకృతి కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సిఎచ్ ప్రదీప్ రెడ్డి అన్నారు. గురువారం మంథని పట్టణంలోని ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తి తో కలిసి పోస్టాఫీస్ ప్రాంతంలో కాకతీయ హై స్కూల్ విద్యార్థులతో ఆయన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి, గట్టు కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలో వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత వంటి అనేక పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా ఎదిగే వరకు సంరక్షిస్తే పచ్చని భవిష్యత్తును నిర్మించగలమని అన్నారు. ప్రస్తుతం చాలామంది మొక్కలు నాటుతున్నప్పటికీ, వాటిని సంరక్షించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం గట్టు కృష్ణమూర్తి ఎన్నో సంవత్సరాలుగా స్వచ్ఛందంగా మొక్కలు నాటుతూ వాటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఆయన సేవలను స్థానికులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించేందుకు ఆయన చేస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కాకతీయ హై స్కూల్ డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, విద్యార్థులు



ఉత్సాహంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాభావం పెంపొందిందని ఉపాధ్యాయులు, స్థానికులు అభిప్రాయపడ్డారు. పచ్చదనం పెంపొందించేందుకు గట్టు కృష్ణమూర్తి చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ, మరెందరికో స్ఫూర్తినిస్తున్నాయని పలువురు కొనియాడారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి కన్నుమూత: బండి రమేష్ నివాళి



**ముద్ర కూకట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి గురువారం పరమ పదిం చారు. ఈ విషయమై సమా చారం అందుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్.. స్థానిక నాయకులతో కలిసి కృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి తనయుడు శ్రీనివాస్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను బండి రమేష్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ధైర్యం చెప్పారు. దివంగత అమరం కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్, కరుణాకర్, విశాల్, భరత్, ఆలీ, సుజిత్ గౌడ్, అరుణ్, సురేష్, రమాదేవి, సురేష్ బాబు, అభిషేక్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ఎంపీ వద్దిరాజుకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 9. :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా నియమితులైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఖమ్మంలో ఉన్న ఎంపీ రవిచంద్రను పలువురు స్వయంగా కలిసి, కొంతమంది ఫోన్ చేసి,కొందరు సోషల్ మీడియా ద్వారా తమ సంతోషం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఖమ్మం తెలంగాణ భవన్ లో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,మెచ్చా నాగేశ్వరరావు,జేడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, పార్టీ నాయకులు ఉప్పల వెంకటరమణ,బొమ్మెర రాంమూర్తి, పగడాల నరేందర్, గిరిబాబు, ముత్యాల అప్పారావు, తాళ్లూరి జీవన్,మందడపు శంకర్ రావు,బులుసు మురళీకృష్ణ,చావా రాంమోహన్ తదితరులు ఎంపీ రవిచంద్రను శాలువాలతో సత్కరించి, మిఠాయి తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఎంపీ రవిచంద్ర అభిమానులు మిఠాయిలు పంచారు.అలాగే, ఎంపీ వద్దిరాజు చిరకాల అభిమానులు సుంకర చిరంజీవి,ఆకుల సురేష్,నానబాల హరీష్, సద్దాం, గొట్టిముక్కల శ్రీనివాస్,కుక్కల వెంకన్న తదితరులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

## రవీంద్రభారతిలోని పాల్కూరికి సోమన్న మూలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సంక్షేమ గీతాలు కుటుంబ విధ్వంసం నాటక ప్రదర్శన




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 9.** : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సందర్భంగా 101 రోజులు విస్తరించినందున, సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 100వ రోజు (09-07-2026) రవీంద్ర భారతిలోని పాల్కూరికి సోమన్న మూల కళాకారుల మువ్వల సవ్వడితో, చైతన్య గీతాలతో మార్మోగింది. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ గీతాల ఆలాపన మరియు 'కుటుంబ విధ్వంసం' నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.సంక్షేమ గీతాల ఆలాపన:తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ అద్భుతమైన గళంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సామాజిక అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాటల రూపంలో వివరించారు. వారి ఉత్సాహభరితమైన ప్రదర్శన ప్రేక్షకుల్లో ఒక కొత్త చైతన్యాన్ని నింపింది.'కుటుంబ విధ్వంసం' నాటకం:ప్రస్తుత సమాజంలో మారుతున్న జీవనశైలి, వ్యసనాలు, మానవీయ విలువల క్షీణత వల్ల కుటుంబాలు ఎలా విచ్ఛిన్నమవుతున్నాయో కళ్లకు కట్టినట్లు ఈ నాటకంలో ప్రదర్శించారు. కళాకారుల జీవన శైలి నటన, భావోద్వేగాలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులను అభినందించారు. అలాగే సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, ముచర్ల దినకర్, శ్రీపల్లె నర్సింహా, కవి యాకుబ్ కార్యక్రమానికి హాజరై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులను ప్రతిభను ప్రశంసిస్తూ వారిని అభినందించారు.

## ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించిన బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 9.** : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా నియమితులైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పార్టీ అధ్యక్షులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును కలిసి ఆశీస్సులు అందుకున్నారు.రాజ్యసభలో పార్టీ నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్ గా రవిచంద్రను నియమిస్తూ గురువారం సాయంత్రం కేసీఆర్ ఆయనకు పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కేసీఆర్ కు రవిచంద్ర పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, ధన్యవాదాలు చెప్పారు.రవిచంద్రకు కేసీఆర్ తన ఆశీస్సులు అందజేస్తూ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## బేగంపేట్‌లో సునీత గ్రేస్ పైల్స్ అండ్ పెయిన్ క్లినిక్‌ను ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 9.** : బేగంపేట్‌లోని పిల్లర్ నెంబర్--1353 సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిసునీత గ్రేస్ పైల్స్ అండ్ పెయిన్ క్లినిక్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ లి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు..ఈ సందర్భంగా క్లినిక్‌కు చేరుకున్న ఎమ్మెల్యే కి క్లినిక్ యాజమాన్యం ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు..అనంతరం ఎమ్మెల్యే క్లినిక్‌లోని ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ముందుకు వచ్చిన వైద్యులు, నిర్వాహకులను అభినందించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు లభించడం అత్యంత అవసరమని, ముఖ్యంగా పైల్స్ నొప్పి సంబంధిత సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు అందించే ఇటువంటి క్లినిక్‌లు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు..సమాజ ఆరోగ్యాభివృద్ధికి వైద్య రంగంలో సేవలందిస్తున్న హాస్పిటల్ యాజమాన్యం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో క్లినిక్ వైద్యులు, హాస్పిటల్ యాజమాన్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## జేఎన్టీయూ వద్ద విద్యార్థుల మహా ధర్నా: ఆర్ 2 విద్యార్థులకు 30 గ్రేస్ మార్కులు ఇవ్వాలని డిమాండ్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జేఎన్టీయూ విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద =22 రెగ్యులేషన్ విద్యార్థులకు 0.50% చొప్పున 30 గ్రేస్ మార్కులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా ఉధృతంగా మారడంతో రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షులు రాహుల్ నాయక్, ఎస్టీవీఎస్ హైదరాబాద్ నగర కార్యదర్శి రోషన్, బిఆర్ఎస్‌వి కూకట్‌పల్లి డివిజన్ నాయకులు గిరీష్ మాట్లాడుతూ... పోలీసు అరెస్టులు, కేసులు తమ ఉద్యమాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. =22 విద్యార్థుల న్యాయమైన డిమాండ్‌ను ఆలకించి, 30 గ్రేస్ మార్కులను గరిష్ఠంగా 6 సబ్జెక్టుల వరకు కలుపుకునే వెసులుబాటు కల్పిస్తూ విశ్వవిద్యాలయం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో =18 రెగ్యులేషన్ విద్యార్థులకు, అలాగే ప్రతిష్టాత్మకమైన జేఎన్టీయూ కళాశాల పరిధిలోని =21 విద్యార్థులకు 30 గ్రేస్ మార్కులు ఇచ్చినప్పుడు, అదే పాలసీని =22 విద్యార్థులకు వర్తింపజేయడానికి ఉన్న ఇబ్బంది ఏమిటని వారు ప్రశ్నించారు. వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జేఎన్టీయూ యాజమాన్యం వెంటనే స్పందించాలన్నారు. లేనిపక్షంలో ఈ సమస్యను ఉన్నత విద్యాశాఖ అధికారులతో పాటు గౌరవ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి అనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీనికేతన్, నితిన్ రెడ్డి, సిద్ధార్థ పటేల్, ఋత్విక్, శ్రీహాస్, సాయి కుమార్, శ్రీ వర్ధన్, ప్రణీత్, రాజ్ కుమార్, చక్రవర్తి, తను కుమార్, ఆనంద్, గౌతమ్, రాహుల్ సామల, అక్షిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 9.** : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షులు, జస్టిస్ సామ్ కోశీ ఆదేశాల మేరకు, గౌరవ సభ్య కార్యదర్శి శ్రీ పంచాక్షరి సూచనలతో, 18-07-2026న మనోరంజన్ కాంప్లెక్స్, నాంపల్లి సికింద్రాబాద్ కోర్టులలో నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్ (సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసుల పరిష్కారం) విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ ఆధ్వర్యంలో నేడు సమన్వయ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ గౌరవ చైర్‌పర్సన్ సెషన్స్ జడ్జి శ్రీమతి కె. సాయి రమా దేవి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, చెక్కు బౌన్స్ కేసులను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు బదులుగా పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదిక అని తెలిపారు. ప్రజలకు సమయం, ధనం ఆదా కావడంతో పాటు, ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన అన్ని సెక్షన్ 138 ఎన్.ఐ. యాక్ట్ కేసులను ప్రత్యేక లోక్ అదాలత్‌కు విస్తృతంగా రిఫర్ చేయాలని, బ్యాంకులు మరియు ప్రైవేట్ ఆర్థిక సంస్థలు తమ ఖాతాదారులను రాజీకి ప్రోత్సహించాలని సూచించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. అరుణ కుమారి గారు సమావేశానికి ఆతిథ్యం వహించి, ప్రత్యేక లోక్ అదాలత్ లక్ష్యాలు, నిర్వహణ విధానం, కేసుల ఎంపిక, రాజీ ప్రక్రియ, సంబంధిత అధికారుల పాత్రను సవివరంగా వివరించారు. అర్హత కలిగిన ప్రతి కేసును గుర్తించి, రాజీ అవకాశాలను ముందుగానే పరిశీలించి, 18-07-2026న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో పరిష్కారానికి తీసుకురావాలని కోరారు.ఈ సమావేశంలో సెక్షన్ 138 ఎన్.ఐ. యాక్ట్ కేసులను విచారిస్తున్న న్యాయాధికారులు, వివిధ జాతీయీకృత మరియు ప్రైవేట్ బ్యాంకుల అధికారులు, ప్రైవేట్ ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొని, ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా చెక్కు బౌన్స్ కేసులను వేగవంతంగా, స్నేహపూర్వకంగా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విజ్ఞప్తి చేసింది.

## ఎల్‌నీనో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

**భారత వాతావరణ శాఖ సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి**

**ప్రభుత్వం పూర్తి అప్రమత్తం...**

**రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**జిల్లాల వారీ కార్యాచరణకు ఆదేశాలు**

**నీటి లభ్యతకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించాలి**

**గ్రామసభలు, రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలి**

**వాతావరణ, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**రైతులు అధికారుల సూచనల మేరకే సాగు నిర్ణయాలు తీసుకోవాలి**

**-- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)జూలై 9:** ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైతాంగం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.రైతులు భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న వర్షపాతం అంచనాలు, హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే మార్గదర్శకాలనే అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నీనో పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయ కార్యాచరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఐటీడపరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ ఎన్ సి రమేష్ బాబు,వ్యవసాయశాఖా కార్యదర్శి సురేంద్ర మోహన్ లు సమీక్ష లో పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వార వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా వారీ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షించి, వాటికి అనుగుణంగానే పంటల ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, గ్రామసభలు, రైతు వేదికలు, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృతంగా వివరించాలని సూచించారు.వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా రైతులకు చేరవేయాలని చెప్పారు. ఏ ప్రాంతంలో ఏ పంట అనుకూలమో శాస్త్రవేత్తల సిఫారసుల ఆధారంగా రైతులకు స్పష్టమైన సలహాలు అందించాలని ఆదేశించారు.రిజర్వాయర్లలో ఉన్న వాస్తవ నీటి నిల్వలపై రైతులకు పారదర్శక సమాచారం అందించి, నీటి లభ్యతకు అనుగుణంగానే సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు ప్రారంభమైన వెంటనే శ్రీపాద ఎల్లంపల్లి సహా గోదావరి బేసిన్‌లోని ప్రధాన జలాశయాలను సమర్థవంతంగా నింపేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎల్‌నీనో సవాళ్లను శాస్త్రీయ ప్రణాళికతో ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

## హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారుల నియామకం.

**వర్షాకాల సీజన్ నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం - హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 9.** : జిల్లా పరిధిలోని 169 బస్తీ దవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను ఈనెల 10 వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ తనిఖీలను సమన్వయం చేస్తూ తనతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజుల పాటు ఎంపిక చేసిన ముఖ్యమైన బస్తీ దవాఖానలను స్వయంగా తనిఖీలు చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అలాగే మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రతి బస్తీ దవాఖాన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి అని సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తమ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానలను స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు అలాగే ఇతర ప్రజాప్రతినిధులు విధిగా సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులతో సమన్వయం చేయాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## 13న టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన

**15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా**

**టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 9.** : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా 13,వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా ను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు,కూకట్ పల్లి నియోజకవర్గం కన్వీనర్ ఎం రాంబాబు పిలుపు నిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. ఈనెల 13న జిల్లా కలెక్టర్కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు తెలుపుతామని, 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు . హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని వ్యాఖ్యనించారు. వెంటనే జర్నలిస్టులందరికీ నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని తెలిపారు. ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిడేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తేచేశారు. జర్నలిస్టులకు పెన్షన్ రూ. 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని ఎం రాంబాబు విజ్ఞప్తి చేశారు.



## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల: సీఎం రేవంత్ రెడ్డి

**యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం**

**కొత్త క్రీడా పాలసీతో క్రీడారంగానికి ప్రోత్సాహం**

**గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో క్రీడలు వెనుకబడ్డాయని వ్యాఖ్య**

**నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ**



హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్?లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రస్థానంలో ఇదొక కీలక ముందడుగు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 1990 నుంచి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అటువంటి మెగా ఈవెంట్లు జరగకపోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నూతన క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చే నవంబర్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అపారమైన జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్ పతకాల సాధనలో వెనుకబడి ఉండటంపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానపరమైన లోపాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఉపాధికి, ఉజ్వల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరఫున బిడ్ దాఖలు చేయాలని లేదా భారత్‌కు ఆ అవకాశం దక్కితే కనీసం కొన్ని క్రీడా విభాగాలనైనా ఇక్కడ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే గచ్చిబౌలి స్టేడియాల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

## ఫలిస్తోన్న ప్రభుత్వ చర్యలు - తెలంగాణ విద్యా సంస్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

**తెలంగాణ విద్యారంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు**

**సత్ఫలితాలిచ్చిన ప్రభుత్వం చేపట్టిన చర్యలు**

**కేంద్రం విడుదల చేసిన ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ పురోగతి**



పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉపాధ్యాయుల నియామకాలు, శిక్షణలు, డిజిటల్ విద్య, కృత్రిమ మేధస్సును పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్-2.0లో తెలంగాణ 28వ స్థానం నుంచి పది స్థానాలు అధిగమించి 18వ స్థానానికి చేరింది.నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సర్కారు ప్రకటించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్--2.0 నివేదికనే నిదర్శనమని తెలిపింది. 2024-25తో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో తెలంగాణ గణనీయంగా మెరుగుపడిందని పేర్కొంది. వెయ్యి మార్కులకు గానూ 2024--25లో 552.5 స్కోరు సాధించిన రాష్ట్రం, ఈ ఏడాది 599.7 మార్కులు సాధించి 28వ స్థానం నుంచి పది స్థానాలు అధిగమించి 18వ స్థానానికి చేరుకుంది. తెలుగులో అభ్యసన సామర్థ్యం 9 నుంచి 35 శాతానికి, ఆంగ్లంలో 4 నుంచి 29 శాతానికి, ఉర్దూలో 19 నుంచి 40 శాతానికి, గణితంలో 18 నుంచి 30 శాతానికి పెరిగిందని ప్రకటించింది.విద్యా ప్రమాణాలు పెంచేందుకు సర్కారు తీసుకున్న చర్యలే ఈ ఫలితాలకు ప్రధాన కారణమని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 10 వేలకు పైగా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, అవసరాలకు తగినట్టు ఉపాధ్యాయుల బదిలీలు చేయడం వల్ల జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ఫలితాలు వచ్చాయని అభిప్రాయపడింది. ఇప్పటికే 283 కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన సర్కారు, ఈ విద్యా సంవత్సరం నుంచి మరో 120 కేజీబీవీలను ఉన్నతీకరణకు కృషి చేసినట్లు వివరించింది. 93 కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దామని తెలిపింది. డిజిటల్ విద్యను మరింత బలోపేతం చేస్తూ 194 మోడల్ స్కూళ్లు, 495 కేజీబీవీలు, 37 రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో ఉచిత డిజిటల్ కోచింగ్ అందిస్తున్నట్టు వివరించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఏఐ, డిజిటల్ లిటరసీ, కోడింగ్, డిజైన్ థింకింగ్ అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చినట్టు ప్రకటించింది. ఆధునిక బోధన విధానాలను అందిపుచ్చుకోవడం, డిజిటల్ సాంకేతికత, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి ఈ సమగ్ర చర్యలతో విద్యా రంగం శరవేగంగా వృద్ధి సాధిస్తోందని సర్కారు పేర్కొంది. భవిష్యత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించింది.తెలంగాణ రాష్ట్రంలో 18-23 సంవత్సరాల విద్యార్థుల్లోని ప్రతి 100 మందిలో 46.60 శాతం మంది డిగ్రీ, ఆపై విద్యను అభ్యసిస్తున్నట్లు 'అఖిల భారత ఉన్నత విద్య సర్వే 2023-24'లో వెల్లడైంది. దీన్ని స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్)గా వ్యవహరిస్తారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. కేంద్ర విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన ఈ సర్వే రిపోర్ట్ ప్రకారం దేశంలో డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుతున్న అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య ఎక్కువున్న రాష్ట్రంగా తెలంగాణ 3వ స్థానంలో నిలిచింది. ఈ అంశంలో బిహార్, బంగాల్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. అత్యధిక కళాశాలలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ 2,160 కాలేజీలతో తొమ్మిదో స్థానంలో ఉంది.

## మీకోసం : 24లోపు ఎన్యూమరేషన్ పత్రం బీఎల్‌వోకు తిరిగి ఇవ్వకపోతే ఏమౌతుంది

**తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ సర్వే**

**ఈ నెల 24వ తేదీలోపు ఎన్యూమరేషన్ పత్రాలు అందివ్వకపోతే ఓటరు జాబితాలో పేర్లు గల్లంతే!**

**వెల్లడించిన ఈసీ కార్యాలయ శిక్షణ నోడల్ అధికారి చెన్నయ్య**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సర్ సర్వే కొనసాగుతోంది. ఎన్యూమరేషన్ ఫారాలను ఈ నెల 24వ తేదీలోపు నింపి బీఎల్‌వోలకు (బూత్ లెవల్ అధికారులు) అందించకపోతే ఓటర్ల జాబితాలో పేర్లు ఉండవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ శిక్షణ నోడల్ ఆఫీసర్ చెన్నయ్య స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ పత్రం ఇవ్వకపోయినట్లయితే ముసాయిదా జాబితా ప్రకటించిన ఈ నెల 31వ తేదీ తర్వాత ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈటీవీ-ఈటీవీ భారత్ ఆధ్వర్యంలో బుధవారం చెన్నయ్యతో ఫోన్-ఇన్ కార్యక్రమం జరిగింది. ఇందులో పలువురు తమ సందేహాలు వ్యక్తం చేయగా, చెన్నయ్య ఇలా సమాధానాలు ఇచ్చారు.ఎన్యూమరేషన్ ఫారం అందనట్లయితే ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్‌లో మీ పోలింగ్ బూత్‌కు సంబంధించిన బీఎల్‌వో నంబరుకు కాల్ చేస్తే ఎన్యూమరేషన్ పత్రం తీసుకొచ్చి ఇస్తారు. బీఎల్‌వోలు స్పందించనట్లయితే ఈఆర్వో నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

ఎస్ఐఆర్-2002 సర్వేలో ఓటు ఉన్నవారు మొదటి బాక్సు కాలంలో నింపాల్సి ఉంటుంది. 2002లో ఓటు లేనివారు వారి తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఒకరిది ఎస్ఐఆర్-2002 వివరాలను రెండో బాక్సు కాలంలో నింపాల్సి ఉంటుంది. ఈ రెండు వివరాలూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్ పూరించాలి.

ఈ నెల 31వ తేదీ తర్వాత ముసాయిదా నోటిఫికేషన్ సమయంలో అడ్రస్ మార్పు కోసం ఫారం-8 నింపి, ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంత ఈఆర్వోకు సమర్పించవచ్చు.

ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ)-2002లో పాత జిల్లాలు, నియోజకవర్గాలే వస్తాయి. ఆ వివరాలే నింపాల్సి ఉంటుంది. రాష్ట్రం కాలంలో ఏపీ ఉంటుంది. పొరపాటున తెలంగాణ అని రాసినప్పటికీ ఇబ్బందేమీ లేదు.

విదేశీ పౌరసత్వం ఉన్నట్లయితే ఇక్కడ ఎన్యూమరేషన్ పత్రం నింపొద్దు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటు ఉంటే ఏదైనా ఒక ప్రాంతంలో మాత్రమే ఎంచుకోవాల్సి ఉంటుంది. రెండుచోట్లా ఇచ్చినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసీ అధికారులు హెచ్చరించారు.

ఎన్యూమరేషన్ పత్రాలతో కలిపి ఎలాంటి ధ్రువపత్రాలు ఇవ్వాల్సిన పని లేదు. మీ పత్రంపై అనుమానాలున్నట్లయితే ఈఆర్వో నోటీసులు అందిస్తారు. ఆ సమయంలో అధికారులు అడిగిన డాక్యుమెంట్లు సమర్పిస్తే సరిపోతుంది.

**సర్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో సులభంగా చేయండిలా :**

ముందుగా గూగుల్‌లోకి వెళ్లి voters.eci.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలి. తొలిసారి వెబ్‌సైట్‌ను సందర్శిస్తున్నట్లయితే లాగిన్ కోసం అందులో సెల్‌ఫోన్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. దాని ద్వారా పోర్టల్‌లోకి లాగిన్ కావాల్సి ఉంటుంది.అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అనే పేరుతో ఫిల్ ఎన్యూమరేషన్ ఫారం అనే పేరుతో ఉన్న లింక్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత రాష్ట్రాన్ని ఎంపిక చేస్తే కుడి వైపు మరో ఆప్షన్ కనిపిస్తుంది. అందులో ఓటర్ కార్డు సంఖ్యను ఎంటర్ చేయాలి. తర్వాత మరో ఆప్షన్ తెరపైకి వస్తుంది. అందులో ఎంటరైన మొబైల్ నంబర్‌కు ఎంటర్ చేస్తే మరో ఓటీపీ వస్తుంది.తెలంగాణ రాష్ట్రంలో చివరగా 2002లో సమగ్ర ఓటరు జాబితాను(ఎస్ఆర్ఐ) తయారు చేశారు. ఆ సమయంలో ఉన్న కుటుంబీకులు తండ్రి లేదా తల్లి ఓటరు ఐడీ ద్వారా కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు నంబర్ తెలుసుకునేందుకు సైతం అక్కడ సెర్చ్ ఆప్షన్‌ను కల్పించారు. వారి 2002లోని ఓటరు కార్డు కావాలంటే వెళ్లి చూసుకోవచ్చు.ఒకవేళ నియోజకవర్గం మారినా, వేరే జిల్లాలో ఉన్నా ఎంపిక చేసుకునే అవకాశాన్ని కూడా ఈసీ అధికారులు కల్పించారు. దీంతో ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్యుమరేషన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయినట్లు ఓ రిసీట్ జనరేట్ అవుతుంది. దాన్ని అధికారులు పరిశీలించి ఆమోదం తెలిపితే మీ సర్ ప్రక్రియ విజయవంతం అవుతుంది.ప్రవాస భారతీయుల(ఎన్ఆర్ఐ) కుడివైపున ఉన్న ఫర్ ఓవర్సీస్ ఓన్లీ అనే ప్రత్యేక ఆప్షన్‌ను కల్పించారు. ఆ ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకొని ఈ సర్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.ఫోన్ నంబర్ ఓటర్ కార్డు లింక్ లేనన్నట్లయితే ఫాం-8 అప్లికేషన్ నంబర్ ద్వారా లింక్ చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. ఆ తర్వాత ప్రక్రియను కంప్లీట్ ఉంటుంది.ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ నుంచి ఈసీఐఎన్ఈటీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని కూడా ఈ ప్రక్రియను నిమిషాల వ్యవధిలో చూసేందుకు అవకాశం ఉంటుంది.

# కడియం శ్రీహరిది కపట బుద్ధి

**నా శాఖను హైజాక్ చేశారు: కొండా సురేఖ**

**పీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు**

**కడియంపై చర్యలు కోరిన మంత్రి**

**తనకు తెలియకుండా తన దేవాదాయ శాఖలో**

**సమీక్ష నిర్వహించారని ఫిర్యాదు**

**సీఎం, మీనాక్షి నటరాజన్ దృష్టికీ తీసుకెళ్లినట్లు వెల్లడి**

**ఎదుటివాళ్ల ఎదుగుదలను కడియం ఓర్వలేరని విమర్శ**



మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు.ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు.తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు.కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు.మరోవైపు కడియం-సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## హరీశ్ రావు అబద్ధాలతో సీఎంను బదనాం చేస్తున్నారు: జగ్గారెడ్డి



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు అవాస్తవ ప్రచారం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల ప్రతిష్టకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ నేత టి. జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీశ్ రావుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయకూడదనే నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్నది కాదని, అది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన ఆదేశమని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఆ బ్యారేజీల్లో నీటిని నింపితే అవి కూలిపోయే అవకాశం ఉందని, ఫలితంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చీణూాా హెచ్చరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టును అత్యంత నాసిరకంగా నిర్మించారని, ఆ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు వైఫల్యం వల్లే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన్ను పదవి నుంచి తప్పించారని జగ్గారెడ్డి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు సంధించే ముందు, ప్రాజెక్టులో దొర్లిన లోపాలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.మూడు నెలల పాటు నీటిపారుదల శాఖను తనకు అప్పగించాలంటూ హరీశ్ రావు విసిరిన సవాల్‌పై జగ్గారెడ్డి వ్యంగ్యంగా స్పందించారు. మంత్రి పదవి కావాలనుకుంటే హరీశ్ రావు రాజ్యాంగ నిబంధనల ప్రకారం కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కోరిన విధంగా, కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రశ్న రావణ్ హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణర్హత లేదు: హైకోర్టు

**జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ**

**పిటిషన్‌కు విచారణర్హత ఉండదని హైకోర్టు స్పష్టీకరణ**

**రిమాండ్ విధింపుపై అభ్యంతరం ఉంటే ఉత్తర్వులను సవాలు చేసుకోవాలని వెల్లడి**




యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి అరెస్ట్ చేసిన నేపథ్యంలో హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణార్హత ఉండదని హైకోర్టు తేల్చి చెప్పింది. రిమాండ్ విధింపుపై అభ్యంతరం ఉంటే సంబంధిత ఉత్తర్వులను సవాలు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఓ వైపు జోసెఫ్ జైల్లో ఉన్నారంటూనే మరోవైపు కోర్టు ముందు హాజరుపరచాలని ఏ విధంగా కోరతారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. దీంతో వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతివ్వాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తరఫు న్యాయవాది కోరడంతో ధర్మాసనం అనుమతి ఇచ్చింది.న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో జోసెఫ్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, అతన్ని హైకోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ సీజేఏసీ ప్రతినిధి ఆర్చ్ బిషప్ డాక్టర్ అశోక్‌బాబు చేగుడి అలియాస్ జోషువా డేనియల్, పాత్రికేయుడు మేకల భానుమూర్తి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు నిషేధిత మావోయిస్టు సంస్థకు మద్దతు తెలిపేలా ప్రసంగాలు చేసిన కేసులో అరెస్టయిన యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్' పలువురు యువతులతో సాగించిన రాసలీలలు బయటపడ్డాయి. అతను నలుగురైదుగురితో అసభ్యంగా, అశ్లీలంగా తీసుకున్న స్వీయ వీడియోలను పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. హోటల్ గదిలో వెకిలి చేష్టలు, సంభాషణలతో వీడియోలు తీసి ఆయన భద్రపరచుకున్నాడు. పోలీసులు విచారణకు వచ్చేటప్పుడు అవన్నీ డిలీట్ చేశాడు. పోలీసులు కేసుకు సంబంధించిన వీడియోల కోసం రావణ్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి విశ్లేషించారు. ఆయన తొలగించిన వీడియోల్లో ఎక్కువ ఈ రాసలీలల దృశ్యాలే ఉన్నట్లు గుర్తించారు. హిందూ దేవతలు, ప్రజాప్రతినిధులను కించపరుస్తూ, కుల మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే రావణ్ ఆ అమ్మాయిలను బెదిరించి లోబర్చుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## తిరుమల సమాచారం.. సర్వదర్శనానికి 18 గంటల సమయం

**దేశం నలుమూలల నుంచి తరలి వస్తున్న భక్తులు**

**భక్తులతో నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు**

**నిన్న శ్రీవారిని దర్శించుకున్న 82,172 మంది భక్తులు**



కలియుగ వైకుంఠం తిరుమల గిరులు భక్తుల జనసందోహంతో పోటెత్తుతున్నాయి. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో తిరుమాడ వీధులు, క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోవడంతో వెలుపల కూడా క్యూలైన్లు సుదీర్ఘంగా సాగుతున్నాయి.ప్రస్తుతం ఎలాంటి టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులకు స్వామివారి సర్వదర్శనం (ఉచిత దర్శనం) లభించడానికి దాదాపు 18 గంటల సుదీర్ఘ సమయం పడుతోంది. ఈ క్రమంలో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడకుండా టీటీడీ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిబ్బంది నిరంతరాయంగా మంచినీరు, పాలు, కాఫీతో పాటు అన్నప్రసాదాలను క్యూలైన్లలోనే పంపిణీ చేస్తున్నారు.నిన్న మొత్తం 82,172 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని తరించారు. 36,978 మంది భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారి హుండీ ద్వారా లభించిన కానుకల ఆదాయం ఏకంగా రూ. 5.15 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ అధికారులు అధికారికంగా వెల్లడించారు.

## బాలికపై అత్యాచారం.. జీవిత ఖైదు విధించిన ఏలూరు పోక్సో కోర్టు

**మైనర్‌పై లైంగిక దాడి, హత్యాయత్నం కేసులో నిందితుడికి జీవిత ఖైదు**

**నిందితుడు వడ్లమూడి బాలకృష్ణకు రూ.35,000 జరిమానా**

**2015లో ద్వారకా తిరుమల మండలంలో జరిగిన దారుణ ఘటన**



పదకొండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడి, హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడికి ఏలూరు ప్రత్యేక పోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిందితుడు వడ్లమూడి బాలకృష్ణ (39)కు జీవిత ఖైదుతో పాటు రూ.35,000 జరిమానా విధిస్తూ బుధవారం ప్రత్యేక న్యాయమూర్తి కనుగుల వాణిశ్రీ తీర్పు వెలువరించారు.ఈ కేసు వివరాల్లోకి వెళితే.. 2015 అక్టోబర్ 21న ద్వారకా తిరుమల మండలంలోని ఓ గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నిందితుడు బాలకృష్ణ తొలుత బాలిక తల్లిదండ్రులపై ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆ బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టాడు.తన నేరం బయటపడకుండా, సాక్ష్యాలను నాశనం చేసే ఉద్దేశంతో బాలిక కాళ్లు, చేతులు కట్టేసి, ఇంట్లోని వంట గ్యాస్ లీక్ చేసి నిప్పంటించాడు. అయితే, ఆ బాలిక మంటల నుంచి ప్రాణాలతో బయటపడి, బంధువుల ఇంటికి చేరుకుని జరిగిన ఘోరాన్ని వివరించింది. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది.దీనిపై పోక్సో, ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. సుదీర్ఘ విచారణ అనంతరం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం, నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేసింది. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఈ తీర్పు ద్వారా కోర్టు స్పష్టం చేసింది.

# సావాసం



"అమ్మగారూ.."రాజమ్మ పిలుపుతో, చేనంతా కలియ చూస్తున్న జానకమ్మ ఉలిక్కిపడింది. "ఈ మిరప చేను మాదే అమ్మగారూ! అరెకరం ఉంటది. మిర్చి ఏరడానికి కూలి మదుసులు దొరుకుతలేరు. అందరి తోటలు ఇప్పుడే కోతకొస్తయి కదా! గందుకని కైకిలికి కొద్దిమందే దొరికింద్రు" అన్నది రాజమ్మ. మిరప తోటలో ఎర్రగా పండిన మిరపపండ్లు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఊరికి దగ్గరలోనే ఉన్నది ఆ చేను. "ఏం పని లేకుండ, ఇంటికాడ ఉత్తగనే కూసుంటే ఏం తోస్తది అమ్మగారూ! పాత ఇసయాలన్నీ యాదికొచ్చి గుబులైతుంటది. జర గిట్ల అటు, ఇటు తిరుగుతా ఉంటే మదికి కాస్త ఊరట వస్తది. గందుకనే నిన్ను ఇక్కడికి తోలుకొచ్చిన" అన్నది రాజమ్మ. లింగాపురం చిన్న గ్రామం. అతని కుమారుడైన వరదాచార్యులు కూడా తండ్రితోపాటు గుడికి వెళ్లేవాడు. అలా వెళుతూ అర్చకత్వం, పౌరోహిత్యం నేర్చుకున్నాడు. ఆ ఊరిలో శ్రీవైష్ణవుల కుటుంబాలు, బ్రాహ్మణుల కుటుంబాలు మరో నాలుగు ఉన్నాయి. కాలక్రమేణా దొర ఏర్పాటు చేసిన గుడిమాన్యం, ఊరి రాజకీయాలలో హరించుకుపోయింది. తిరువెంగళాచార్యుల అనంతరం వరదాచార్యులు అర్చకత్వానికి వచ్చేసరికి.. గుడికి వచ్చే ఆదాయం శూన్యమైపోయింది. గుడిలో రోజూ దీపం ముట్టించాలన్నా.. వరదాచార్యులే తన చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరదాచార్యులకు జానకమ్మతో వివాహం జరిగిన తర్వాత, కుటుంబ జరుగుబాటే కష్టమైపోయింది. గుడి అర్చకత్వంతోను, పౌరోహిత్యంతోను, ఒక కుటుంబం జీవించగలగడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈలోగా కొడుకు వెంకటాచార్యులు, కూతురు గోదాదేవి జన్మించారు. "ఏమండీ! ఈ అర్చకత్వంతో మనం బతకడం, పిల్లలను చదివించుకోవడం కష్టం అవుతూ ఉంది కదండీ. మన ఊర్లో ఉన్న మన బంధువులు, బ్రాహ్మణ కుటుంబాలు కూడా పట్నానికి వలస పోతున్నారు కదండీ. మనం కూడా పట్నానికి వెళ్లి బతుకుదెరువు వెతుకుందామండీ" అంటూ బతిమిలాడింది జానకమ్మ. "ఈ వరదరాజ స్వామి గుడి, అర్చకత్వం మా తండ్రిగారి కోరిక మేరకు మన కుటుంబానికి లభించిన అదృష్టం. ఇదంతా వదిలేసి, ఇప్పుడు అర్ధంతరంగా వెళ్లిపోతే ఆయన ఆత్మ శాంతిస్తుందంటావా జానకీ " అన్నాడు వరదాచార్యులు. "ఆత్మల శాంతికోసం ఆలోచిస్తే, మన ఆత్మారాముడు ఎలా శాంతిస్తాడండీ? పిల్లలకు రెండు పూటలా కడుపునిండా తిండి పెట్టుకోవాలి కదా? పట్నంలో ఏదో ఒక పని చేసుకొని బతకవచ్చు. ఈ అరుపులకు, అలికిడికి రాజమ్మ బయటికి వచ్చింది. "ఏమైందిరా మల్లిగా! అయ్యగారికి ఏమైంది?" అడిగింది రాజమ్మ. "ఏమోనత్తా! గంట కొట్టుకుంటా కొట్టుకుంటా గట్లనే పక్కకు ఒరిగిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేడు" అన్నాడు మల్లిగాడు. "అమ్మగారూ పద.. పొయ్యి చూద్దాం" అంటూ జానకమ్మను తీసుకొని వెళ్లింది రాజమ్మ. గుడిలో అచేతనంగా పడి ఉన్నాడు వరదాచార్యులు. రాజమ్మ మల్లిగాణ్ని పంపించి, ఆ ఊర్లో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టరును పిలిపించింది.

డాక్టర్ వచ్చి పరీక్షించాడు.

"ఇది పక్షవాతం స్ట్రోక్ లాగా ఉన్నదమ్మా ! పక్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుపోండి" అని చెప్పి వెళ్లిపోయాడు. రాజమ్మ తన భర్తను పిలిపించి, బండి కట్టించి.. అయ్యగారిని పక్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. జానకమ్మ అంటే రాజమ్మకు చాలా ఇష్టం. ఇద్దరూ దాదాపు ఒకే ఈడువారు. దాదాపు ఒకే సంవత్సరం పెళ్లయి అత్తగారింటికి వచ్చారు. ఆ ఇద్దరి మధ్య స్నేహం బాగా అల్లుకుపోయింది. జానకమ్మ శ్రీవైష్ణవుల ఇంటిపిల్ల కాబట్టి.. రాజమ్మ ఆమెను ఎప్పుడూ గౌరవంగా 'అమ్మగారూ' అని పిలిస్తే.. జానకమ్మ ఆప్యాయంగా 'రాజమ్మా!' అని పిలిచేది. రాజమ్మ సహకారంతో వరదాచార్యులకు చికిత్స చేయించింది జానకమ్మ. అతనికి పక్షవాతం అని డాక్టర్లు చెప్పారు. మంచంలో ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్న చెట్టంత మనిషిని చూస్తుంటే గుండెలు ఆర్చుకుపోతున్నాయి జానకమ్మకు. ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు చిన్నపిల్లలను చూస్తూ ఏం చేయాలో, జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. పూజారి అక్షతలు చల్లి ఆశీర్వచనాలు పలికేవాడు. ఆ సందర్భంలో ఆ భక్తులలో కనిపించే గౌరవ మర్యాదలు చూస్తున్న వెంకటాచారికి, తన తండ్రి ఎంతో గొప్పవాడని, సాక్షాత్తూ భగవంతుడే అన్న తలంపు కలిగేది. తాము ఎంతో గొప్పవాళ్లం కాబట్టే, అలా గౌరవిస్తున్నారని భావన కలిగేది. కానీ, పక్షవాతం వచ్చి మంచాన పడిన తండ్రిని చూస్తూ ఉంటే.. అమ్మ కూలికి వెళ్లి తెచ్చిన జొన్న గటకతో కడుపులు నింపి, ఆకలి తీర్చుకుంటూ ఉంటే.. జీవితంలో మరోకోణం కూడా ఉంటుందని వెంకటాచార్యులకు అర్థమైంది. ఈ గింజలు గట్క వొండు. అయ్యగారికి, ఈ పిల్లలకు ఇంత తినిపించు. బాధపడతా కూసుంటే ఆకలి తీరదు కదా అమ్మా" అంటూ ఓదార్చి వెళ్లిపోయింది రాజమ్మ.

అప్పటికి రెండు రోజులైంది ఆ ఇంట్లో పొయ్యి రాజేసి. జానకమ్మకు ఆ గింజలే అమృతం లాగా అనిపించింది. జొన్న గటక తినడం పిల్లలకు ఎంతో కష్టమైంది. కొడుకు వెంకటాచార్యులు జొన్న గటక చూసి.. "అమ్మా! ఇది మనం తినే అన్నంలాగా లేదు కదమ్మా" అంటూ మొహం విరిచాడు. "నాన్నగారికి ఆరోగ్యం తొందరగా నయం కావాలంటే.. ఈ ఆహారమే ఇవ్వాలని డాక్టరు చెప్పాడు బాబూ. మరి నాన్నగారికి త్వరగా నయం కావాలి కదా నాన్నా" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ. కష్టాల ఊబిలో ఉన్న జానకమ్మకు ఎలాగైనా సహాయం చేయాలని అనుకున్నది రాజమ్మ. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. అదే విషయం తన భర్తతో మాట్లాడింది. అతడి సలహా నచ్చింది ఆమెకు.

మర్నాడు రాజమ్మ తాను చేనుకు వెళ్లేటప్పుడు..

"జానకమ్మ గారూ! నాతోపాటు చేనుకు పోదాం రా. ఊరికెనే ఇంట్ల కూసుంటే గుబులుగ ఉంటది" అంటూ తనవెంట చేనుకు తీసుకెళ్లింది. అక్కడ ఒక గంట తర్వాత జానకమ్మకు విసుగు అనిపించింది. రాజమ్మ ఒక గంప తెచ్చి జానకమ్మకు ఇచ్చింది. "నాకు కాస్త సాయం చెయ్యండి అమ్మగారూ! ఈ పండు మిరపకాయలు తెంపి బుట్టలో వెయ్యి. ఏదో పని చేస్తా ఉంటే.. మనసు తెరిపిన పడుతది కదా!" అని ప్రోత్సహించింది. చేనులో కూలోళ్లను చూస్తూ కూర్చుంటే, నిజంగానే విసుగు చెందిన జానకమ్మకు.. కాస్త ఏదైనా పని చేస్తుంటే బావుందు అనిపించింది. తనుకూడా వాళ్లతో పాటు కూలి పనికి వెళుతున్నానని. కానీ, ఆ పని కూడా చేయకపోతే, ఆ కాసిన్ని తిండి గింజలు కూడా దొరకవనే సత్యం కూడా అవగతమైంది ఆమెకు.

ఆ విధంగా జానకమ్మను తన పరిధిలోకి తీసుకొచ్చుకున్నది రాజమ్మ.

"మీలాంటి పెద్దోల్లకు సాయపడితే మాకు పోయిన జన్మల పాపాలు పోతాయట తల్లీ" అంటూ జానకమ్మను తనవెంట కూలికి తీసుకొని పోయేది రాజమ్మ. కాలచక్రం తిరిగి పోయింది. వెంకటాచార్యులు చదువు పూర్తయ్యాక.. ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. హాస్పిటల్లో రాజమ్మను చూడ్డానికి వెళ్లిన జానకమ్మ.. తన కిడ్నీని రాజమ్మకు ఇస్తానని చెప్పింది. డాక్టర్లు పరీక్ష చేసి.. ఆమె కిడ్నీ సరిపోతుందని చెప్పారు. కానీ, జానకమ్మకు ఇంట్లోంచి వ్యతిరేకత ప్రారంభమైంది.

వరదాచార్యులు, అతని వియ్యంకుడు పరమేశం దీనిని వ్యతిరేకించారు.

"తక్కువ కులం వాళ్లతో సహవాసం చేయడమే దోషం. నిత్యాగ్ని హోత్రంలాంటి మన శ్రీ వైష్ణవ కుటుంబాలకు, ఆ తక్కువ కులం వాళ్లతో సావాసం ఏమిటి? ఇంతకాలం అడిగేవాళ్లు లేరనేగా! ఇప్పుడు ఈ ఇంటికి పిల్లనిచ్చిన వ్యక్తిగా నేనందుకు ఒప్పుకోను. అసలు ఆ తక్కువ కులం వాళ్లతో స్నేహమే నాకు ఇష్టం లేదు. మనవి సంశ్రయణాలు చేసిన సంప్రదాయ కుటుంబాలు. నిత్యం పూజలు, పునస్కారాలు చేసే శ్రీ వైష్ణవులం. ఈ కుల భ్రష్టతకు నేను ఒప్పుకోను. మనవాళ్లు కిడ్నీలు కూడా అలాంటి వారికి ఇవ్వకూడదు" అంటూ ఒంటికాలు మీద లేచాడు పరమేశం. తన బిడ్డను వెంకటాచార్యులకు ఇచ్చి పెళ్లి చేశాడు కాబట్టి.. ఆ విధంగా తన ఆధిక్యతను నిలుపుకోవాలని అతని ప్రయత్నం. నివ్వెరపోయిన జానకమ్మ.. వెంకటాచార్యుల వైపు చూసింది. ఆమె కళ్లలో నీళ్లు లేవు. గత కాలంలో తాము పడిన కష్టం, రాజమ్మతో ఆమె స్నేహం, రాజమ్మ చేసిన సహాయ సహకారాలు అన్నీ కనిపించాయి వెంకటాచార్యులకు. నెమ్మదిగా లేచి వచ్చి, తల్లి భుజం మీద చేయి వేశాడు. తల్లిని దగ్గరికి పొదువుకున్నాడు. ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

"మామయ్యా! మీ ఆరాటంలో అర్థం ఉన్నది. కానీ మానవత్వం లేదు. మా నాన్నగారికి జబ్బు చేసి, మంచాన పడి ఉన్న రోజున..ఈ విషయంలో మా అమ్మ ఏ నిర్ణయం తీసుకుంటే, దానికి అందరం బద్ధులమై ఉండాలి. ఇష్టం లేనివాళ్లు ఇప్పుడే వెళ్లిపోవచ్చు" అన్నాడు వెంకటాచారి ప్రశాంతంగా.

తూటాల్లాగా వెలువడిన ఆ మాటలలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కనిపించింది. పరిమళ లోపలికి వెళ్లి బ్యాగు తెచ్చి తండ్రికి ఇచ్చి.. గుమ్మం దాకా సాగనంపి వచ్చింది. చెట్టంత కొడుకు నీకు అండగ ఉన్నడు. ఏడవకుండ్రి. కండ్లు తుడ్సుకోండి!" అన్నది రాజమ్మ. "నీ సావాసమే నాకు కొండంత అండ రాజమ్మా!" అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకున్నది జానకమ్మ.


నెల్లుట్ల రుక్మిణి

కష్టాల్లో ఉన్నవారికి ఎలాగైనా సాయం చేయాలనే తపన.. మానవ జీవితానికి విలువను తీసుకొస్తుంది. అలాంటి తపనతో ఉన్న ఓ నిరుపేద స్నేహితురాలికి, ఆమె ఆప్యాయతకు, స్నేహబంధానికి, సామాజిక అంతరాలు అడ్డురావని చెప్పే కథ.. 'సావాసం'. రచయిత్రి నెల్లుట్ల రుక్మిణి. మనుషులను, జీవితాలను, ప్రకృతిని పరిశీలించడం.. చిన్నప్పటినుంచే అలవాటు చేసుకున్నారు. 50 ఏళ్ల కింద.. ఇల్లెందు క్రాంతి స్కూలు ప్రిన్సిపాల్‌గా పని చేసినప్పుడు.. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేసేవారు. ఆ పిల్లల తల్లిదండ్రులతో కలిగిన పరిచయం.. వీరిలో కథలు రాయాలనే తలంపునకు కారణమైంది. వారు చెప్పిన జీవిత వెతలనే, కథలుగా మలిచేందుకు ప్రయత్నించారు. వీరు రాసిన పలు కథలు.. కొత్తగూడెం రేడియో కేంద్రంలో మూడేళ్లపాటు ప్రసారమయ్యాయి. అనేక కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'వెన్నెల పూలు' బాలగేయ సంపుటి, 'బతుకు ఎతలు' కథల సంపుటిని ముద్రించారు. అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. నిర్మాతగా.. శ్రీ

## ఈ ఐదు నగరాలు ప్రపంచంలోనే సంపన్నమైనవి.. అన్ని సౌకర్యాలకు నెలవు..











ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పర్యాటక రంగంలో బెస్ట్, కొన్ని టెక్నాలజీలో బెస్ట్. అయితే చాల సిటీస్ మంచి జీవన వైవిధ్యం కలిగి ఉన్నాయి. అలాగే ప్రపంచంలో సంపన్న నగరాలు కూడా ఉన్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి విద్య, ఉద్యోగంతో పాటు అన్ని అనువైన సౌకర్యాల అందించే నగరాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. వాటిలో టాప్ 5 నగరాలూ ఏంటి.? ఈ స్టోరీలో తెలుసుకుందామా..

**న్యూయార్క్ నగరం,** యూనిట్ స్టేట్స్ అఫ్ అమెరికాలోని న్యూయార్క్ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇది చాలా మంది బిలియనీర్లకు నిలయం. బలమైన ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, టెక్ మార్కెట్‌ను కలిగి ఉంది. ప్రపంచ దేశాల నుంచి చాలామంది ప్రజలు ఇక్కడికి జాబ్స్ చేయడానికి వస్తారు.

**టోక్యో, జపాన్:** టోక్యో ఆసియాలో బలమైన నగరంగా మిగిలిపోయింది, అనేక ధనిక కుటుంబాలు, కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పాత సంస్కృతి, కొత్త వ్యాపారం మిశ్రమంగా ఉన్నాయి. జపాన్ ఎప్పుడు టెక్నాలజీలో ప్రపంచదేశాల అన్నింటికంటే ముందే ఉంటుంది.

**శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా,** సిలికాన్ వ్యాలీతో సహా బే ఏరియా ఇప్పటికీ గూగుల్, ఆపిల్, ఫేస్‌బుక్ వంటి టెక్ దిగ్గజాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ చాలా మంది టెక్, స్టార్టప్‌లలో పనిచేస్తున్నారు. ఈ ప్రాంతం లక్షాధికారులతో నిండి ఉంది.

**లండన్,** లండన్ ఒక ప్రపంచ ఆర్థిక కేంద్రం. అనేక మంది సంపన్నులకు నిలయం. దీనికి బ్యాంకింగ్, ఫ్యాషన్, రియల్ ఎస్టేట్‌తో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ నగరం విద్యారంగానికి ప్రసిద్ధ చెందింది. భారత్ సహా అనేక దేశాల విద్యార్థులు ఈ సిటీకి చదువుకోవడానికి వెళ్తారు.

**సింగపూర్:** సింగపూర్ ఆసియాలో ఒక పెద్ద ధన కేంద్రంగా మారింది. దాని తక్కువ పన్నులు, శుభ్రమైన వ్యవస్థ, బలమైన బ్యాంకింగ్ దీనిని ధనవంతులు, వ్యాపారాలకు అనువైనదిగా చేస్తాయి. తక్కువ పన్ను కారణం అనేక దేశాల ప్రజలు ఇక్కడకి పని కోసం వెళ్తుంటారు.

## మజ్జిగలో చిటికెడు ఇంగువ కలిపి తాగితే ఏం జరుగుతుందో తెలుసా..?










మజ్జిగతో కలిగే లాభాలేంటో దాదాపు ప్రతి ఒక్కరికీ తెలిసిందే, అయితే, మజ్జిగని నేరుగా తాగే బదులు ఓ పదార్థం కలిపి తాగితే బోలెడన్నీ లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంగువ శరీరంలో ఎసిడిటీని తగ్గిస్తుంది. ఇంగువ ఇమ్యూనిటీని బలపరుస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో మజ్జిగ తాగితే ఇంగువ తాగితే చాలా మంచిది. ఇంగువలో రోగ నిరోధకత, యాంటీ ఆక్సిడెంట్లు చాలా ఎక్కువ. ఇంగువతో బీపి తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగ్గా మారుతుంది. రక్తం గడ్డకట్టడం లాంటి సమస్యలు ఉండవు. దీని వల్ల స్ట్రోక్, గుండె సమస్యలు, ప్రమాదకర సమస్యలు రావు. ఇంకా మరెన్నో లాభాలు ఉన్నాయని అవన్నీ తెలియాలంటే.. పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే...

మజ్జిగలో ఇంగువ కలుపుకుని తాగితే జీర్ణక్రియకు అద్భుతంగా ఉపయోగపడుతుంది. మజ్జిగలో కొద్దిగా ఇంగువ కలుపుకుని తాగితే గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. పరగడుపున మజ్జిగ తాగితే చాలా మంచిది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఇంగువ కలిపితే మరింత ఉపయోగం. ఇంగువ కలిపి తాగితే చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించే ఉపయోగపడుతుంది.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.





మజ్జిగలో జీర్ణవ్యవస్థ మెరుగుపర్చే ప్రో బయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇంగువ జీర్ణశక్తికి సంబంధించిన సమస్యలకు మందుగా పని చేస్తుంది. భోజనం చేసిన తరువాత చిటికెడు ఇంగువ, చిటికెడు ఉప్పును మజ్జిగలో కలిపి తీసుకుంటే పొట్టలో గ్యాస్ సమస్య గ్గుతుంది. దీనివల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది.

మజ్జిగలోని లాక్టోస్ కొంతమందికి అలర్జీలు, జీర్ణ సమస్యలకి కారణమవుతుంది. దీని వల్ల కొంతమందికి కడుపునొప్పి, విరోచనాలు, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. కడుపు నొప్పి, విరోచనాలను తగ్గించడానికి కొద్దిగా ఇంగువ కలిపి తీసుకుంటే మంచిది. మెరుగైన జీర్ణక్రియతో పాటు ఆరోగ్యం బాగుంటుంది.

మ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

ఇంగువ కలిపిన మజ్జిగ తీసుకోవటం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది. కడుపు నిండుగా ఉంటుంది. దీంతో అనారోగ్యకర ఆహారం ఎక్కువగా తినకుండా ఉంటారు. ఈ కారణంగానే బరువు తగ్గుతారు. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మహిళల్లో పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పి, తిమ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

## మీ ఇంట్లో దోమలు ఎక్కువగా ఉన్నాయా..? ఈ నాచురల్ టిప్స్‌ను పాటించండి చాలు..!



వర్షాకాలం వచ్చేసింది. సీజనల్ వ్యాధులు ఇప్పటికే చాలా మందికి వస్తున్నాయి. ఈ సీజన్ లో దోమలు కూడా దాడి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి వాతావరణం ఉంటే దోమలు వృద్ధి చెందడం చాలా సులభతరం అవుతుంది. దీంతో దోమలు పుట్టలు పుట్టలుగా తయారై మన ఇండ్లలోకి వచ్చి మనపై దాడి చేస్తాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మన రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తుంటాయి. దీంతో మనకు అనేక విష జ్వరాలు, ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. అయితే కొన్ని రకాల సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే దోమల బెడద ఉండదు. దోమలను తరిమి కొట్టవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. దోమలను తరమాలంటే ముందుగా దోమలు లేకుండా చూడాలి. ఇంటి చుట్టు పక్కల లేదా ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి. దోమలకు ఇవే ఆవాసాలు కనుక నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చేయాలి.

### ఆయిల్స్..

చెత్తను కూడా శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులకు చెత్తను అందించాలి. ఇక దోమలను తరిమేందుకు యూకలిప్టస్ ఆయిల్ అద్భుతంగా పనిచేస్తుంది. ఒక స్ప్రే బాటిల్‌లో కొన్ని నీళ్లను తీసుకుని అందులో కొన్ని చుక్కల యూకలిప్టస్ ఆయిల్ వేయాలి. తరువాత బాగా కలపాలి. దీన్ని దోమలు ఉన్న చోట స్ప్రే చేయాలి. దీంతో దోమలు పారిపోతాయి. సిట్రొనెల్లా ఆయిల్ కూడా ఇలాగే అద్భుతంగా పనిచేస్తుంది. దీన్ని కూడా నీటిలో కలిపి ఉపయోగించాలి. దోమలను తరిమి కొట్టడంలో వేప నూనె కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. మార్కెట్‌లో మనకు పలు రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ లభిస్తాయి. ఇవన్నీ కూడా దోమలను తరిమికొట్టగలవు. లావెండర్ ఆయిల్, పెప్పర్ మింట్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్, క్లోవ్ ఆయిల్, సినామన్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్.. ఇలా పలు రకాల ఆయిల్స్ లభిస్తాయి. వీటిలో ఏ ఆయిల్‌ను వాడినా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

### మొక్కలు..

దోమలను తరిమికొట్టాలంటే మీ ఇంట్లో కొన్ని రకాల ఇండోర్ మొక్కలను పెంచుకోవాలి. సిట్రొనెల్లా గ్రాస్ అని పిలవబడే ఓ రకమైన గడ్డిని ఇంట్లో పెంచాలి. ఇది మస్కిటో రీపెల్లెంట్ గుణాలను కలిగి ఉంటుంది. దీని వాసన దోమలకు నచ్చదు. దోమలను తరిమి కొడుతుంది. ఈ మొక్క నిమ్మ వాసన వస్తుంది. అందుకనే దోమలు పారిపోతాయి. లావెండర్ అనే మొక్కను ఇంట్లో పెంచుతున్నా కూడా దోమల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మొక్క నుంచి వచ్చే వాసన కూడా దోమలకు పడదు. దోమలు దూరంగా పారిపోతాయి. తులసి మొక్క ఉన్న ఇంట్లోకి దోమలు రావని చెబుతారు. కనుక తులసి మొక్కను కూడా పెంచుకోవాలి. బంతి పూల మొక్కలను ఇంట్లో లేదా ఇంటి ఆవరణలో పెంచితే దోమల బెడద నుంచి రక్షణ లభిస్తుంది. బంతిపూలు వెదజల్లే వాసన దోమలకు నచ్చదు. దోమలు దూరంగా పారిపోతాయి.

### ఈ చిట్కాలు కూడా..

పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పుదీనా ఆకుల నుంచి వచ్చే వాసన దోమలకు నచ్చదు. అవి దూరంగా పారిపోతాయి. లెమన్ బామ్ అనే మొక్కను పెంచుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని నుంచి వచ్చే ఘాటైన నిమ్మ వాసన దోమలకు నచ్చదు. ఇది దోమలను పారిపోయేలా చేస్తుంది. అలాగే రోజ్‌మేరీ మొక్కలను కూడా ఇంట్లో పెంచుకోవచ్చు. ఇవి కూడా దోమల నుంచి రక్షణను అందిస్తాయి. కాట్నిప్, యూకలిప్టస్, వెల్లుల్లి మొక్కలను పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవన్నీ దోమలు రాకుండా చేస్తాయి. అలాగే ఒక పాత్రలో కొద్దిగా నీటిని తీసుకుని అందులో కొన్ని కర్పూరం బిళ్లలను వేసి గదిలో పెట్టాలి. దాని నుంచి వచ్చే వాసనకు కూడా దోమలు పారిపోతాయి. అలాగే ఒక నిమ్మకాయను అడ్డంగా కోసి అందులో లవంగాలను గుచ్చి గదిలో కిటికీలు లేదా దోమలు ఉండే ప్రాంతంలో పెట్టాలి. ఈ వాసనకు కూడా దోమలు పారిపోతాయి. ఇలా దోమలను తరిమి కొట్టవచ్చు.

# మీరు ఇన్సూరెన్స్ తీసుకున్నారా - "నామినీ" రోల్ ఏంటో తెలుసా

**నామినీని ఎంచుకోకపోతే పాలసీ ఉద్దేశ్యమే వృథా అయిపోతుంది!**

**భవిష్యత్తులో నామినీని మార్చుకోవచ్చా**




లైఫ్ ఇన్సూరెన్స్.. కుటుంబానికి రక్షణ కల్పించే ఒక మెరుగైన ఆర్థిక వనరు. అయితే ప్రస్తుత రోజుల్లో చాలా మంది జీవిత బీమా అనగానే టర్మ్ ఇన్సూరెన్స్ వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే ఇది తక్కువ ప్రీమియంతో ఎక్కువ హామీ అందిస్తుంది. అయితే, ఎలాంటి జీవిత బీమా పాలసీ తీసుకున్నప్పటికీ.. నామినీని సరిగా ఎంచుకోకపోతే అదంతా వృథా అయిపోతుంది. దురదృష్టవశాత్తు పాలసీదారుడు మరణిస్తే.. తనపై ఆధారపడిన వారికి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే జీవిత బీమా తీసుకుంటారు. ఆ వ్యక్తి లేదా వ్యక్తులు ఎవరైతే ఉంటారో, వారినే నామినీగా ఎంచుకోవాల్సి ఉంటుంది. పాలసీదారుడు స్వయంగా వారిని ఎంపిక చేసుకుంటారు. దాదాపుగా కుటుంబ సభ్యులనే నామినీగా ఎంచుకుంటారు. ఒకవేళ వారు పనులు చేసుకునే స్థితిలో లేనివారైతే.. బాగా తెలిసిన వారిని, నమ్మకస్తులను నామినీగా ఎంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ నామినీ మైనర్ అయితే (18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉంటే), పాలసీదారుడు తప్పనిసరిగా మరొక వ్యక్తిని 'అపాయింటీ' లేదా సంరక్షకుడిగా నియమించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. పాలసీదారుడు కేవలం ఒక్కరినే కాకుండా ఎక్కువ మందిని కూడా నామినీలుగా నియమించుకునే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాంటి సమయంలో బీమా ప్రయోజనాలు ఆ నామినీలకు తగిన నిష్పత్తిలో పంపిణీ చేస్తారని వివరిస్తున్నారు. అయితే, ఇలా బహుళ నామినీలను నియమించడం వల్ల కొన్నిసార్లు వారి మధ్య చట్టపరమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. నామినీని నియమించడంతోపాటు, పాలసీదారుడు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మంది 'కంటింజెంట్ నామినీ'ల (ప్రత్యామ్నాయ నామినీలు) పేర్లను కూడా పరిశీలించొచ్చని చెబుతున్నారు. కంటింజెంట్ నామినీ అంటే, ప్రధాన నామినీ క్లెయిం మొత్తాన్ని స్వీకరించలేకపోయినా లేదా స్వీకరించడానికి ఇష్టపడకపోయినా, ఆ మొత్తాన్ని పొందే వ్యక్తి లేదా సంస్థ అని చెబుతున్నారు. ప్రధాన నామినీ మరణించడం/అనారోగ్యానికి గురవ్వడం/ఇతర పరిస్థితుల కారణంగా ఆ మొత్తాన్ని నిర్వహించలేకపోవడం వంటి సందర్భాల్లో ఇది వర్తిస్తుందని వివరిస్తున్నారు. అయితే, బీమా సంస్థ సాధారణంగా ఒక నామినీకి క్లెయిం మొత్తాన్ని చెల్లించడానికే ఇష్టపడుతుందని అంటున్నారు. ఒక్కోసారి పరిస్థితుల కారణంగా నామినీ పేరు మార్చాల్సి రావచ్చు. పాలసీదారుడు జీవించి ఉన్నప్పుడే నామినీ దురదృష్టవశాత్తు మరణిస్తే, ఆ నామినేషన్ ప్రక్రియ చెల్లదు. అప్పుడు పాలసీదారుడు తప్పనిసరిగా నామినీని మార్చాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇదేకాకుండా.. భవిష్యత్తులో పాలసీదారుడికి నామినీ నచ్చకపోయే పరిస్థితులు కూడా రావచ్చు. ఇలాంటప్పుడు నామినీని మార్చుకునే స్వేచ్ఛ పాలసీదారుకు ఉంది. ఇలా ఎన్నిసార్లయినా నామినీని మార్చవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీని కోసం బీమా సంస్థ అడిగిన పత్రాలు సమర్పించి, ఫారం నింపితే సరిపోతు ందంటున్నారు.

# స్టాక్ మార్కెట్లలో రక్తపాతం.. ఒక్కరోజే రూ. 8 లక్షల కోట్లు ఆవిరి!

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు**

**సెన్సెక్స్ 1677, నిఫ్టీ 517 పాయింట్ల నష్టం**

**పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం**



అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీగా కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే సుమారు రూ. 8 లక్షల కోట్లు ఆవిరైంది. అమ్మకాల సునామీ కారణంగా బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 2 శాతానికి పైగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,677 పాయింట్లు నష్టపోయి 76,503.60 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 517 పాయింట్లు పతనమై 23,882.05 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ సహా అన్ని రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. హార్ముజ్ జలసంధిలో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే భయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర సుమారు 5 శాతం పెరిగి 78 డాలర్లకు చేరుకుంది. ఈ పరిణామాలు భారత కరెన్సీపైనా తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.50 స్థాయిని దాటి బలహీనపడింది. పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణ ఆందోళనలను పెంచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఇటీవలి లాభాలన్నీ ఈ ఒక్క సెషన్‌లోనే తుడిచిపెట్టుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

# పీఎఫ్ చందాదారులకు గుడ్ న్యూస్

**రూ.5లక్షల వరకు ఆటోమేటిక్ క్లెయిమ్ సెటిల్‌మెంట్**

**ఈపీఎఫ్‌లో కొత్త డిజిటల్ వ్యవస్థ ప్రారంభం**

**ఈనెల 15 నాటికి పీఎఫ్ చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ**

పీఎఫ్ చందాదారులకు గుడ్ న్యూస్. ఈపీఎఫ్ఓ కొత్త డిజిటల్ వ్యవస్థను ప్రారంభించింది. ఆటోమేటిక్ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను రూ.5 లక్షల వరకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15 నాటికి పీఎఫ్ చందాదారాల ఖాతాల్లో వడ్డీ జమ చేయనున్నట్లు తెలిపింది. గతంలో చందాదారులు తమ ఖాతాల్లో వడ్డీ జమ కావడానికి సెప్టెంబర్ లేదా అక్టోబర్ వరకు వేచి చూడాల్సి ఉండేది. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం కీలక ప్రకటన చేశారు. "కొత్త కేంద్రీకృత ఐటీ ప్లాట్‌ఫారమ్ అందుబాటులోకి వచ్చింది. అందువల్ల వడ్డీ జమ ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గింది. ఈ జులై 15 నాటికి 34 కోట్ల మంది పీఎఫ్ చందాదారాల ఖాతాల్లో 8.25 శాతం మేర వడ్డీ జమ అవుతుంది. మొత్తం రూ.1.44 లక్షల కోట్ల ఈపీఎఫ్ వడ్డీ జమ చేస్తాం. గతంలో ఇదే మొత్తాన్ని సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జమ చేసేవాళ్లం. ఇప్పుడు ఈ ప్రక్రియ ఆటోమేటిక్ కావడం వల్ల ప్రాసెసింగ్ సమయం చాలా తగ్గింది" అని అన్నారు. ఈపీఎఫ్ఓ తన 'సెంట్రలైజ్డ్ ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్' ప్రాజెక్టు కింద సభ్యుల రికార్డులన్నింటినీ ఒకే జాతీయ డేటాబేస్‌కు విజయవంతంగా బదిలీ చేసింది. సంస్థ అందించే సేవలను ఆధునీకరించడం, ఆటోమేషన్, నిబంధన ఆధారిత ప్రాసెసింగ్, పాదర్శకత, సమర్థ్యాన్ని పెంచేలో ఒక ఏకీకృత ప్లాట్‌ఫారమ్‌ను తీసుకురావడమే లక్ష్యంగా దీనిని తీసుకువచ్చింది. గతంలో ప్రాంతీయ కార్యాలయాలు ప్రత్యేకంగా డేటాబేస్‌లను నిర్వహించేవి. దీని వల్ల వడ్డీ జమ ప్రక్రియ ఆలస్యం అయ్యేది. కానీ ఇప్పుడు కేంద్రీకృత డేటాబేస్ అందుబాటులోకి రావడంతో సభ్యుల సర్వీస్ అభ్యర్థనలను కేవలం ఆ ఖాతా ఉన్న ప్రాంతీయ కార్యాలయం నుంచే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న ఏ ఈపీఎఫ్ఓ అధికారిక కార్యాలయం నుంచైనా ప్రాసెస్ చేయవచ్చు. ఈ కొత్త యూనిఫైడ్ పోర్టల్‌లో చందాదారులు తమ ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్, క్లెయిమ్ స్థితి, పెన్షన్ రికార్డులు, పొందిన ప్రయోజనాల వివరాలను సులభంగా చూసుకోవచ్చు. అయితేకాదు క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయడానికి ముందే, లోపాలను గుర్తించడానికి ఆటోమేటెడ్ ప్రీ-వ్యాలిడేషన్ నిర్వహణ అయిపోతుంది. ఇది రిజెక్షన్ రేటును తగ్గించి, మొదటిసారికే క్లెయిమ్ ఆమోదం పొందడానికి వీలు కల్పిస్తుంది. కేవైసీ పూర్తి చేసిన ఖాతాదారులకు ఈపీఎఫ్ఓ అడ్వాన్స్ క్లెయిమ్‌లను ఆటో-సెటిల్‌మెంట్ చేస్తుంది. కాగా ఈ ఆటో-సెటిల్‌మెంట్ పరిమితిని తాజాగా రూ.1 లక్ష నుంచి రూ.5లక్షలకు పెంచింది. క్లెయిమ్ ప్రాసెసింగ్ సమయంలో ఏమైనా వివరాలు కావాల్సి వస్తే, సభ్యులు నేరుగా ఆన్‌లైన్లోనే తమ సమాధానాలు ఇవ్వవచ్చు. ఇకపై ఉద్యోగులు జాబ్ మారినప్పుడు ఆధార్‌తో అనుసంధానమైన పీఎఫ్ ఖాతాలు ఆటోమేటిక్‌గా బదిలీ అవుతాయి. అంతేకాదు పాక్షిక విత్‌డ్రావల్ నిబంధనలను సరళీకరించారు. ఖాతా ఏ ప్రాంతీయ కార్యాలయంలో ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఈపీఎఫ్ఓ సేవలను పొందే సదుపాయం కల్పించారు.

**పీఎఫ్ కొత్త రూల్స్**

కొత్త నిబంధనల ప్రకారం, నెలకు రూ.15000లోపు జీతం ఉన్నవారికి మాత్రమే 12 శాతం చొప్పున, గరిష్ఠంగా రూ.1800 వరకు కంట్రిబ్యూషన్ కట్ అవుతుంది. అంతకంటే ఎక్కువ జీతం ఉండి, నెలకు రూ.1800 కంటే ఎక్కువ పీఎఫ్ కట్ చేసుకోవాలంటే, అది పూర్తిగా ఉద్యోగి ఇష్టం. ఒకవేళ ఒక ఉద్యోగి జాబ్ మానేసి, పీఎఫ్ ఖాతాలోని పూర్తి డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే 12 నెలలు ఆగాల్సిందే. అది కూడా ఈ కాలంలో సదరు వ్యక్తి నిరుద్యోగిగా ఉన్నట్లు నిరూపించుకోవాలి. గతంలో కేవలం 2 నెలల గ్యాప్ ఉంటే సరిపోయేది. ఇక ఆటో-సెటిల్‌మెంట్ రూల్స్ కూడా మారాయి. అత్యవసర వైద్యం, పెళ్లి, విద్య, ఇంటి నిర్మాణం లాంటి అవసరాల

# చమురు షాక్ ప్రభావం స్వల్పమే

**భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ ధీమా**

**భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఐఎంఎఫ్**

**దేశీయ డిమాండ్ బలంగా ఉండడమే కారణమని విశ్లేషణ**

**దేశ ఆర్థిక సూచీలన్నీ నిలకడగా ఉన్నాయని వెల్లడి**

**2026 వృద్ధి అంచనాలను స్వల్పంగా సవరించిన ఐఎంఎఫ్**

**2027లో మళ్లీ పుంజుకుంటుందని వెల్లడి**




పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. తాజా 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2026 సంవత్సరానికి భారత వృద్ధి అంచనాను 6.4 శాతానికి స్వల్పంగా తగ్గించినప్పటికీ, 2027లో వృద్ధి మరింత బలపడుతుందని వెల్లడించింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటం, ఇటీవలి ఆర్థిక గణాంకాలు ఆశాజనకంగా ఉండటం భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని ఐఎంఎఫ్ వివరించింది. ఐఎంఎఫ్ రీసెర్చ్ విభాగం అధికారి డెనిజ్ ఇగాన్ మాట్లాడుతూ.. తాజా ఆర్థిక సూచీలు భారత ఆర్థిక వ్యవస్థలో నిలకడను చూపిస్తున్నాయని తెలిపారు. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు, వాటి ప్రభావం దేశీయ ఇంధన ధరలపై పడటం వల్ల 2026 వృద్ధి అంచనాను స్వల్పంగా తగ్గించాల్సి వచ్చిందన్నారు. ఈ ఇంధన ఒత్తిడి 2027 నాటికి తగ్గుముఖం పట్టడంతో భారత వృద్ధి మళ్లీ 6.5 శాతం స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఐఎంఎఫ్ తాజా అంచనాలు విడుదల చేసింది. 2026లో ప్రపంచ వృద్ధి 3 శాతం, 2027లో 3.4 శాతంగా ఉంటుందని తెలిపింది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చితే చమురు ధరలు పెరగడంతో పాటు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోవైపు కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊతమిస్తున్నాయని కూడా ఐఎంఎఫ్ పేర్కొంది.


# రూ.55 లక్షల జపాన్ ఉద్యోగానికి నో చెప్పిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

**భార్య ఉద్యోగం కూడా అక్కడే ఉండడంతో రిమోట్ ఉద్యోగంపై మొగ్గు**

**జపాన్‌లో మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సి వస్తుందని వెనక్కి**

**డబ్బుల కంటే కూడా వర్క్-లైఫ్ బ్యాలెన్స్ ముఖ్యమని అభిప్రాయం**

**సరైన నిర్ణయమంటూ మద్దతు ప్రకటించిన నెటిజన్లు**



జైపూర్‌కు చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యశస్వి సోని చేసిన ఓ లింక్డిన్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏడాదికి రూ.55 లక్షల వేతనంతో జపాన్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ, దాన్ని తిరస్కరించి భారత్‌లోనే రిమోట్ ఉద్యోగాన్ని ఎంచుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎక్కువ జీతం కంటే కుటుంబంతో కలిసి ఉండటం, జీవితంలో స్థిరత్వం, పని-వ్యక్తిగత జీవితంలో సమతుల్యత ముఖ్యమని భావించినట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం తన కంపెనీ పూణేకు మారాలని కోరడంతో కొత్త ఉద్యోగాల కోసం ప్రయత్నించానని సోని తెలిపారు. ఈ క్రమంలో లండన్ స్టార్టప్ నుంచి రూ.37 లక్షలు, దుబాయ్ నుంచి రూ.47 లక్షలు, జపాన్ నుంచి రూ.55 లక్షలు, అలాగే ఈపీఏఎం నుంచి రూ.29 లక్షల వార్షిక వేతనంతో రిమోట్ ఉద్యోగావకాశాలు వచ్చాయని పేర్కొన్నారు. కాగితాలపై చూస్తే జపాన్ ఉద్యోగమే ఉత్తమంగా కనిపించినా, తాను నిజంగా జీవితంలో ఏమి కోరుకుంటున్నాననే ప్రశ్నకు సమాధానం వెతికానని చెప్పారు. తన భార్యకు జైపూర్‌లో ఉద్యోగం ఉందని, ఇద్దరూ కోరుకున్న జీవితం అక్కడే ఉన్నట్లు గమనించామని వివరించారు. అలాంటి సమయంలో జపాన్‌కు వెళ్లడం అంటే కొత్త దేశం, కొత్త భాష, కొత్త జీవితం కోసం మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని భావించానన్నారు. దుబాయ్‌లో పన్ను రహిత వేతనం ఉన్నప్పటికీ, అక్కడి జీవనశైలి తమకు నచ్చలేదని తెలిపారు. ఈపీఏఎంలో చేరేందుకు సిద్ధమవుతున్న సమయంలో తన ప్రస్తుత కంపెనీ నుంచి అవకాశం వచ్చిందని సోని చెప్పారు. ఇంటర్వ్యూలు పూర్తయ్యాక మరో ఉద్యోగానికి సమాధానం ఇవ్వాల్సి ఉందని నేరుగా ఇంటర్వ్యూవర్‌కు లింక్డిన్‌లో సందేశం పంపానని తెలిపారు. సానుకూల స్పందన రావడంతో జపాన్, దుబాయ్, ఈపీఏఎం ఉద్యోగాలను తిరస్కరించి ప్రస్తుతం జైపూర్ నుంచే పూర్తిగా రిమోట్‌గా పనిచేస్తున్నానని వెల్లడించారు. "డబ్బు జీవితంలో ముఖ్యమే. కానీ అది ఒక అంశం మాత్రమే. మనం నివసించే నగరం, మన చుట్టూ ఉన్నవారు, జీవనశైలి కూడా అంతే ముఖ్యమైనవి. కాబట్టి కేవలం ఎక్కువ జీతం కోసం కాకుండా.. మొత్తం జీవిత సమీకరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కుటుంబం, మానసిక ప్రశాంతత, రిమోట్ వర్క్‌కు ప్రాధాన్యం ఇవ్వడం సరైన నిర్ణయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ట్రంప్ సంచలన ప్రకటనతో భగ్గుమన్న ముడి చమురు ధరలు

**ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన**

**6 శాతానికి పైగా పెరిగిన ముడి చమురు ధరలు.**

**బ్యారెల్ 80 డాలర్లకు చేరిన బ్రెంట్ క్రూడ్**

**చమురు ధరల ఎఫెక్ట్.. భారీగా నష్టపోయిన భారత స్టాక్ మార్కెట్లు**



అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇవాళ చమురు ధరలు 6 శాతానికి పైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా, అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడ్ అయింది. 'ఐఏఎన్ఎస్' తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సైతం 20 పైసలు క్షీణించి 95.16 వద్ద కొనసాగుతోంది.

# భారత్‌లో బీఎండబ్ల్యూ రికార్డు అమ్మకాలు.. ఎలక్ట్రిక్ కార్లకు భారీ డిమాండ్

**బీఎండబ్ల్యూకు తొలి అర్ధభాగంలో రికార్డు అమ్మకాలు**

**మొత్తం 9,075 కార్లు విక్రయం**

**ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 78 శాతం పెరుగుదల**

**మొత్తం విక్రయాల్లో ఈవీల వాటా 26 శాతం**

**లగ్జరీ ఈవీ మార్కెట్లో 69 శాతం వాటా**


**మినీ కార్లు, మోటోరాడ్‌కూ మంచి డిమాండ్**




భారత్‌లో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో బీఎండబ్ల్యూ గ్రూప్ రికార్డు స్థాయి అమ్మకాలు నమోదు చేసింది. జనవరి నుంచి జూన్ వరకు మొత్తం 9,075 కార్లు విక్రయించినట్లు కంపెనీ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 17 శాతం వృద్ధి అని తెలిపింది. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్ వల్ల కాకుండా, మార్కెట్లో స్థిరమైన ఆదరణతో ఈ ఫలితాలు సాధించినట్లు పేర్కొంది. ఈ కాలంలో ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు కంపెనీకి ప్రధాన బలంగా నిలిచాయి. తొలి ఆరు నెలల్లో 2,359 ఎలక్ట్రిక్ వాహనాలు విక్రయించగా, ఇది గతేడాదితో పోలిస్తే 78 శాతం అధికం. మొత్తం అమ్మకాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 26 శాతంగా నమోదైంది. అంటే ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్ వాహనమే. లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో 69 శాతం మార్కెట్ వాటాతో బీఎండబ్ల్యూ అగ్రస్థానాన్ని కొనసాగించింది. లాంగ్ వీల్‌బేస్ కార్లకు కూడా వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ విభాగంలో అమ్మకాలు 24 శాతం పెరిగి 4,428 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 52 శాతంగా ఉంది. అలాగే స్పోర్ట్స్ యాక్టివిటీ వెహికల్స్ విక్రయాలు 35 శాతం పెరిగి 5,926 యూనిట్లకు చేరాయి. మొత్తం అమ్మకాల్లో ఈ విభాగం వాటా 65 శాతంగా నమోదైంది. కంపెనీకి చెందిన మినీ బ్రాండ్ కూడా మంచి వృద్ధిని నమోదు చేసింది. తొలి ఆరు నెలల్లో 504 కార్లు విక్రయించగా, ఇది 70 శాతం పెరుగుదల. కొత్త 'కంట్రీమ్యాన్ సీ' మోడల్‌తో పాటు ప్రత్యేక ఎడిషన్లకు మంచి డిమాండ్ రావడం దీనికి కారణమని కంపెనీ తెలిపింది. బీఎండబ్ల్యూ మోటోరాడ్ విభాగం కూడా 2,327 మోటార్‌సైకిళ్లను విక్రయించింది. ఇటీవల డెలివరీలు ప్రారంభమైన కొత్త ఎఫ్ 450 జీఎస్ తొలి బ్యాచ్ పూర్తిగా అమ్ముడైనట్లు వెల్లడించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 11 కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకొచ్చామని, మిగిలిన నెలల్లో మరో 14 కొత్త ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రకటించింది. అలాగే దేశవ్యాప్తంగా రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ ప్రస్తుతం 40 నగరాల్లో 100 టచ్‌పాయింట్లతో సేవలందిస్తున్నామని, ఈ ఏడాదిలో మరో 19 అవుట్‌లెట్లను ప్రారంభించనున్నట్లు తెలిపింది.

# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్.. టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# అతడు స్టార్ నటుడు అనుకోలేదు.. మహేష్ బాబు క్రేజ్‌పై కృతి సనన్ కామెంట్స్!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో... అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.



# 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్.. ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్

కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్. ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.




# రూ.100 కోట్ల బడ్జెట్.. రూ.15 కోట్ల కలెక్షన్లు బాక్సాఫీస్ వద్ద కొట్టుమిట్టాడుతున్న 'నాగబంధం'.. వర్కవుట్ కాని 'సనాతన కార్డ్'!



టాలీవుడ్‌లో సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాల నేపథ్యంలో తెరకెక్కిన తాజా సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా కొట్టుమిట్టాడుతోంది. సుమారు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో, విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ పాన్-ఇండియా చిత్రం జూలై 3న విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇటీవలి కాలంలో భక్తి, సనాతన ధర్మం బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న సంగతి తెలిసిందే. మేకర్స్ ఎంత సనాతనం కార్డు వాడిన సినిమాలో మ్యాటర్ లేకపోతే ప్రేక్షకుల ఆ వైపు కూడా చూడాట్లేదు. అయితే తాజాగా ఈ సినిమా కూడా అలాగే 'సనాతన కార్డ్'తో రాగా.. బలహీనమైన కథనం, దర్శకత్వ లోపాలు, ఎక్కువ నిడివి కారణంగా థియేటర్లలో అస్సలు వర్కవుట్ కాలేదు. సినిమాపై భారీ బడ్జెట్ పెట్టినప్పటికీ.. థియేటర్లలో మాత్రం ఈ సినిమా వసూళ్లు అత్యంత ఘోరంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2100 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం, మొదటి మూడు రోజుల్లో (వీకెండ్) కలిపి ఇండియా నెట్ కలెక్షన్ల పరంగా కేవలం రూ. 9.75 కోట్లు మాత్రమే రాబట్టింది. ఇక గ్రాస్ వసూళ్లు, ఓవర్సీస్ కలెక్షన్లు అన్నీ కలిపినా మొదటి వీకెండ్ ముగిసేసరికి వరల్డ్‌వైడ్ కలెక్షన్లు రూ. 13.70 కోట్ల నుండి రూ. 15 కోట్ల లోపే పరిమితమయ్యాయి. సినిమా రన్‌టైమ్ ఎక్కువ ఉందని దాదాపు 20 నిమిషాలు తగ్గించిన కూడా ఆశించిన స్థాయిలో సినిమా లేకపోవడంతో ప్రేక్షకులు ఈ అడ్వెంచర్ రైడ్‌ను తిరస్కరిస్తున్నారు. జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ వంటి భారీ తారాగణం ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద 'నాగబంధం' గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది.



# రవితేజ -- శ్రీ విష్ణు మల్టీస్టారర్‌కు క్రేజీ టైటిల్.. సంక్రాంతి బరిలో నవ్వుల జాతర!

టాలీవుడ్‌లో మరో ఇంట్రెస్టింగ్ మల్టీస్టారర్‌కు రంగం సిద్ధమవుతోంది. మాస్ మహారాజా రవితేజతో పాటు తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీ విష్ణు తొలిసారి ఒకే సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఈ టైటిల్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా కథ, కామెడీ టోన్‌కు తగ్గట్టుగానే ఈ టైటిల్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఱవం ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే శ్రీ విష్ణుతో 'రాజా రాజా చోర', 'స్వాగ్' వంటి చిత్రాలను తెరకెక్కించిన హసిత్ గోలి.. ఇప్పుడు రవితేజతో కలిసి మరో వినోదభరితమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో శ్రీ విష్ణు-హసిత్ గోలి కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ మూవీ కానుంది.పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొంద నున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ నిర్మాత దిల్ రాజు, ఆయన సోదరుడు శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించేలా చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. అలాగే సినిమాను 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్లానింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కు.. శ్రీ విష్ణు సహజమైన హాస్యం తోడైతే ఈ సినిమా వినోదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనడం విశేషం. అయితే సినిమా టైటిల్, విడుదల తేదీతో పాటు నటీనటుల పూర్తి వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అప్పటి వరకు 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌తో ఈ క్రేజీ మల్టీస్టారర్ వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.